RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 227 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, మార్చి,5, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 227 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, March,5, 2026 | PAGES : 8 RS : 4 /- |

### మహిళా సంఘాల సభ్యులకు

## రూ.10 లక్షల బీమా..

- సభ్యురాలి ప్రమాద మరణానికి రూ. 10 లక్షల బీమా సాయం..
- బ్యాంకు అప్పులకు రూ. 2 లక్షల వరకు రుణ బీమా..
- దరఖాస్తుల జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశం



**హైదరాబాద్,మార్చి,04,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక బీమా పథకాలు నేడు వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న క్రమంలో వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈ పథకాల అమలును వేగవంతం చేశారు. సాధారణంగా మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండి బ్యాంకు రుణాలు పొందిన వారు అకస్మాత్తుగా మరణిస్తే.. ఆ రుణ భారం వారి కుటుంబంపై పడటమే కాకుండా.. మిగిలినసంఘ సభ్యులపై కూడా ఆర్థిక ఒత్తిడి ఉండేది. ఇలాంటిపరిస్థితుల్లో బ్యాంకులు సదరు సంఘాలను బ్లాక్ లిస్టులో పెట్టడం వల్ల కొత్తరుణాలు అందక అనేక సంఘాలు మూతపడే పరిస్థితి ఏర్పడేది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ.. సభ్యురాలు మరణిం చినా ఆమె కుటుంబం రోడ్డున పడకుండా ఉండేలా ప్రభుత్వంరుణ బీమా, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పిస్తోంది. ప్రమాదవశాత్తు మహిళా సంఘంలో సభ్యురాలు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి పది లక్షల రూపాయల భారీ బీమా పరిహారాన్ని అందజేస్తున్నారు.

# అసెంబ్లీలో.. భారీ మార్పులు..!



- మార్చి 8న నూతన కౌన్సిల్ హాల్ ప్రారంభం
- అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహ ఆవిష్కరణ
- సీఎం, మండలి చైర్మన్ కొత్త ఛాంబర్లకు శ్రీకారం
- ఒకే ప్రాంగణంలో బడ్జెట్ సమావేశాలు
- పాలనలో సులభతరం.

### రేషన్ కార్డుదారులకు తీపి కబురు..

### మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ..

**హైదరాబాద్,మార్చి,04,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణం మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. అసెంబ్లీ ప్రాంగణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా మార్చి 8వ తేదీన నూతనంగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించనున్నారు. కౌన్సిల్ హాల్ ప్రారంభోత్సవం జరిగే అదే రోజున (మార్చి 8) అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర అస్తిత్వానికి, గౌరవానికి చిహ్నంగా ఈ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేస్తున్నారు.నూతన కౌన్సిల్ హాల్‌తో పాటు, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి (జవీ) ఛాంబర్‌ను , శాసనమండలి చైర్మన్ ఛాంబర్‌ను కూడా ప్రభుత్వం అదే రోజున ప్రారంభించనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, ఈసారి జరగ బోయే బడ్జెట్ సమావేశాలను ఒకే ప్రాంగణంలోని అసెంబ్లీ, నూతన కౌన్సిల్ హాల్‌లలో నిర్వహించనున్నారు. ఉభయ సభల సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరగడం వల్ల పాలనా పరమైన పనులు మరింత సులభతరం కానున్నాయి.



**మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ..**

తెలంగాణ రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త అందించింది. రాబోయే వేసవి కాలంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పేద ప్రజలు ప్రతి నెలా రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఏప్రిల్ నెలలోనే పంపిణీ చేయాలని కేంద్ర పౌర సరఫరాల శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మొదటి వారంలోనే భానుడి భగభగలు మొదలవ్వడం, రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో లబ్ధిదారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఈ ముందస్తు పంపిణీకి శ్రీకారం చుట్టారు.

### నేడు కాప్రా ప్రెస్ క్లబ్ కార్యవర్గం

## ప్రమాణ స్వీకారం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి రాక







**ఏఎస్ రావునగర్, మార్చి 04, (తెలంగాణ దిశ):**కాప్రా ప్రెస్ క్లబ్ కార్యవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేయనుంది. కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని భవానీ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10:30 గంటలకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యు లు ఈటల రాజేం దర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిలో ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. అదేవిధంగా విశిష్ట అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు స్వర్ణరాజు శివమణి, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్, జర్రిపోతుల ప్రభుదాస్, గొల్లూరి అంజయ్య, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, పజ్జూరి పావని రెడ్డి, కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశట్టి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు కొత్త అంజిరెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షురాలు సంధ్యారాణి, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, బిజెపి హెచ్‌బి కాలనీ అధ్యక్షులు రాంప్రదీప్, కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతికిరణ్ లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు యావాపురం రవి,దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, గోవిందుకుంట్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ తదితరులు పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగాక్లబ్‌అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### తమిళనాడులో కొలిక్కి వచ్చిన

## డీఎంకే-కాంగ్రెస్ పొత్తు..

- స్టాలిన్, ఖర్గే మధ్య చర్చలు పూర్తి..
- 28 స్థానాల్లో పోటీ చేయనున్న హస్తం పార్టీ..





తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడింది. అయితే, అధికార డీఎంకే కూటమిలో సీట్ల పంపిణీపై కొన్ని రోజులుగా చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా, కీలక మిత్ర పక్షంగా ఉన్న కాంగ్రెస్ టీవీకే విజయ్ పార్టీలో పొత్తు పెట్టుకుంటుందని ఊహాగానాలు వెల్లువెత్తాయి. అయితే, ఈ రూమర్స్ అన్నింటికి చెక్ పడింది. తమిళనాడులో కాంగ్రెస్-డీఎంకే మధ్య సీట్ల పంపిణీ ఖరారైంది. పొత్తుకు సంబంధించిన లాంఛనా లు అన్ని బుధవారం పూర్తయ్యాయి. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే బుధవారం సీఎం స్టాలిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికల ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం.. తమిళనాడు అసెంబ్లీ పోరులో కాంగ్రెస్ పార్టీకి 28 సీట్లు కేటాయించారు.




# ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్



**న్యూఢిల్లీ,మార్చి,04:** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాజ్యసభ రెండో అభ్యర్థిపై చర్చించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక స్థానానికి పార్టీ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. రెండో స్థానానికి రాష్ట్ర నేతల నుంచి తీవ్రమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఎవరి పేరు సూచించబోతున్నారు? అధిష్టానం ఎవరి పేరు ఫైనల్ చేయబోతోంది అనేది తేలాల్సి ఉంది.

# షార్ట్ సర్క్యూట్ తో మంటలు అంటుకొని ఫర్నిచర్ షాప్ లు దగ్ధం

## కోట్లాది రూపాయల ఆస్తి నష్టం



**కుత్బుల్లాపూర్, మార్చి 04, (తెలంగాణ దిశ):**షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెల రేగి 23 షాపులు పూర్తిగా, 6 షాపులు పాక్షికంగా అగ్నిలో ఆహుతి అయ్యాయి. నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ నుండి సాయి నగర్ కమాన్ మధ్యలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన రోడ్డు కి అనధికారికంగా షెడ్లు వేసుకొని అందులో ఫర్నిచర్ షాపులను కొంత మంది వ్యాపారులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి సుమారు 10 45 గంటలకు కెజిఆర్ కన్వెన్షన్ గోడ పక్కనే ఉన్న విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ లో షార్ట్ సర్క్యూట్ సంభవించి పక్కనే ఉన్న ఫర్నిచర్ షాప్ లోకి మంటలు అంటుకున్నట్లు తెలుస్తుంది. ఫర్నిచర్ షాప్ లో పూర్తిగా చెక్కలతో చేసినవి, ఇతర గృహ ఉపకరణ వస్తువులు కావడంతో మంటలు త్వరగా ఒక షాపు నుండి మరో షాపుకు శరవేగంగా పాకాయి. కొందరు వ్యాపారులు ఫర్నిచర్ షాపులోనే నివసిస్తూ అక్కడే వంటలు చేసుకునేవారు. ఫర్నిచర్ షాపులకు అంటుకున్న మంటలు కాస్త అక్కడ వంటకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లకు అంటుకోవడంతో విపరీతమైన శబ్దాలతో గ్యాస్ సిలిండర్లు పేలిపోయి మంటలు ఉధృతం కావడానికి అవకాశం ఏర్పడింది. ప్రధాన రహదారిపై వెళ్లేవారు ఇది గమనించి హుటాహుటిన నిద్రపోతున్న ఫర్నిచర్ షాపు వారిని మేలుకొలపడంతో అందరూ ప్రాణభయంతో బయటికి పరిగెత్తారు. నిమిషాల వ్యవధిలో సుమారుగా 30 ఫర్నిచర్ షాపులకు మంటలు అంటుకొని సుమారు 50 ఫీట్ల ఎత్తున మంటలు, పొగలు కమ్మి ఫర్నిచర్ షాప్ ల వాళ్లకి, ఆ రహదారిలో ప్రయాణిస్తున్న వారి ని భయభ్రాంతులకు గురయ్యేటట్టు చేసింది. సమీపంలోని కేజీ ఆర్ కన్వెన్షన్ సిబ్బంది ఫర్నిచర్ షాపులలో మంటలు మొదలుకాగానే అప్రమత్తమై తమ వద్దనున్న నీటి పైపుల ద్వారా మంటలను ఆర్పడానికి ఒక వైపు ప్రయత్నిస్తూనే మరోవైపు ఫైర్ ఇంజన్ వారికి, పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తుంది. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు సుమారు గంటన్నర పాటు ప్రయత్నించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు సమాచారం. సంఘటనలో 23 ఫర్నిచర్ షాపులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. మరో 6 షాపులు పాక్షికంగా తగలబడ్డాయి. ప్రతి సంవత్సరం వేసవికాలంలో సీజన్ ఎక్కువగా ఉంటుందని ఆశతో ప్రతి ఒక్క ఫర్నిచర్ షాపు వ్యాపారస్తుడు సుమారు 20 నుండి 40 లక్షల రూపాయల వరకు వెచ్చించి ఇటీవలనే కొత్త స్టాక్ కొనుగోలు చేసినట్లు బాధితులు తమ గోడును వెళ్ళబోసుకుంటున్నారు. అయితే సంఘటన జరిగిన నిమిషాలలోనే ఒకవైపు ఫైర్ ఇంజన్ అధికారులు, స్థానిక పోలీసులు, పోలీసు ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పించడంలో సఫలీకృతులయ్యారు. తద్వారా మంటలు మిగతా ఫర్నిచర్ షాపులకు తగలకుండా కాపాడారు. సంఘటన స్థలానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పలువురు పోలీస్ అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి వివరాలను బాధితుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బాధితులను జరిగిన సంఘటన పట్ల ఆరాతీసి తన సానుభూతిని వ్యక్తం చేశారు. బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే



హామీ ఇచ్చారు. బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు జరిగిన సంఘటనపై ఉన్నత అధికారుల ఆదేశం మేరకు పంచనామా నిర్వహించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కు సమర్పించినట్లు తెలిసింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా గండి మైసమ్మ- మియాపూర్ ప్రధాన రహదారిలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఫర్నిచర్ షాపులు




నిర్వహించడం జరుగుతుంది. దీని నివారణకు గతంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పనిచేసిన గోపి తగు చర్యలు చేపట్టి ప్రధాన రహదారిలో షెడ్లు వేయకుండా ఆపారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా వచ్చిన రామకృష్ణ రావు హయం నుండి ఇక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న తాత్కాలిక ఫర్నిచర్ షాప్ ల ఏర్పాటును అడ్డుకోలేకపోయారు. నేటికీ స్థానిక ప్రభుత్వము నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇక్కడ ఫర్నిచర్ షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారస్తులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. అయితే అనుమతి లేని ఫర్నిచర్ షాపుల ఏర్పాటు వెనకాల సరికొత్త దందా నిర్వహిస్తున్నారని పలువురు స్థానికంగా విమర్శిస్తున్నారు. ప్రధాన రోడ్డు ని ఆనుకుని వేస్తున్న షాపులను దాని వెనకాల ఉన్న ప్రైవేటు స్థలం యజమానులు ఒక్కో ఫర్నిచర్ షాప్ నుండి ప్రతి నెలకు 50 నుండి 60 వేల రూపాయల వరకు అద్దెలు తీసుకుంటూ ఇలాంటివి ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని నివారణకు ఒకవైపు మున్సిపల్ అధికారులు గానీ మరోవైపు పోలీసు అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు సంభవించి కోట్లాది రూపాయల నష్టం జరిగిందని స్పష్టం అవుతుంది. ఇదే సంఘటనలో షాపుల యజమానులు దాచుకున్న డబ్బు, వారు ఉపయోగించిన 6 ద్విచక్ర వాహనాలు కూడా దగ్ధం అయినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని పరిశీలించిన బాచుపల్లి పోలీసులు ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## రూ. 300 కోట్ల విలువైన 13 ఎకరాల

# ప్రభుత్వ స్థలానికి ఎసరు...?

**- సర్వే నెంబర్లు మార్చి, కోర్టులను తప్పుదారి పట్టించడానికి రంగం సిద్ధం - ఇప్పటికే 38 అనధికార షెడ్లు సంవత్సరానికి 45 లక్షల అద్దెలు - దిగమింగుతున్న కబ్జాదారులు**




**కుత్బుల్లాపూర్, మార్చి 04, (తెలంగాణ దిశ):** అది ప్రభుత్వ స్థలం... సుమారు 13 ఎకరాలు. 300 కోట్ల రూపాయల విలువ. కొన్ని సంవత్సరాల నుండి అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులను వినరు. చూసేవారికి అది ఓ ప్రైవేటు స్థలంలా వాతావరణం ఉంటుంది. సుమారు 38 అనధికారిక షెడ్లు. వాటి నుండి నెలకు రూ. 3.80 లక్షల అద్దెలు తీసుకుంటూ కబ్జాదారులు ఎంజాయ్ చేస్తున్నారు. సంవత్సరానికి సుమారు 45 లక్షల రూపాయలు ప్రభుత్వ స్థలానికి అద్దె వసూలు చేసుకుంటూ కబ్జాదారులు పండుగలు చేసుకుంటుంటే దానిని అడ్డుకోవాల్సిన బాచుపల్లి రెవెన్యూ అధికారులు మాత్రం కళ్ళు అప్పగించి చూస్తున్నారు. విచిత్రమైన ఈ పరిస్థితి రాష్ట్రంలో మరెక్కడ కనిపించకపోవచ్చు .కానీ ఇది నిజం.కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, బాచుపల్లి మండలం నిజాంపేట సర్కిల్ , నిజాంపేట గ్రామం సర్వే నెంబర్ 233/21, 22, 23, 24, 25, 26 ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ లావణ్య భూమి. ఒకప్పుడు నిజాంపేట గ్రామస్తులకు వ్యవసాయం చేసుకొని అనుభవించడానికి మాత్రమే తగు పత్రాలను ఆనాడు అప్పటి ప్రభుత్వం అందించింది. అయితే కాలక్రమేనా నిజాంపేట కు గ్రామం కాస్త పట్టణీకరణ చెందడంతో ఇక్కడ గజం స్థలం ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు పెరిగిపోయింది. దీంతో లావని పట్టాదారులను మచ్చిక చేసుకున్న కొందరు వ్యాపారస్తులు దానిని బాచుపల్లి మండలం కాకుండా హైదర్ నగర్ సర్వేనెంబర్ 172/15 గా చూపించి




కూకట్పల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఈ మేరకు ఏకంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్లు చేసుకున్న వ్యక్తులు ఒక సొసైటీగా ఏర్పడి ఆ స్థలాన్ని స్వాధీనంలో తీసుకొని విక్రయాలు జరిపారు. నాటి నుండి నేటి వరకు అదే ప్రాంతంలో ఒక్కో షెడ్ అక్రమ నిర్మాణాలు చేయిస్తూ ప్రతి షెడ్ నుండి నెలకు సుమారు పదివేల రూపాయల చొప్పున కిరాయిలు వసూలు చేసుకుంటున్నట్లు సమాచారం. మొత్తం ఈ 13 ఎకరాల స్థలంలో నేటికీ 38 షెడ్లు ఏర్పాటు అయ్యాయి. బాచుపల్లి రెవెన్యూ కార్యాలయానికి ఏ అధికారి వచ్చిన ఇక్కడ జరుగుతున్న షెడ్లు ల ఏర్పాటు విషయమై అభ్యంతరాలు చెప్పకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏకంగా ఇదే ప్రాంతంలో ఒక కార్యాలయం ఏర్పాటు చేసి దానికి శ్రీనివాస హౌసింగ్ సొసైటీగా నామకరణం చేశారు. అక్కడ పేరు కు అది ప్రభుత్వ స్థలమే అయినా అజమాయిషి అంతా కబ్జాదారుల చేతుల్లోనే ఉంటుంది. గతంలో ఇక్కడ పనిచేసిన తాసిల్దార్ ఫూల్ సింగ్ ఇదే స్థలంపై ఫిర్యాదు రావడంతో కూల్చడానికి వెళ్లగా ఆ అధికారిపై ఏకంగా కోర్టులో




కేసు వేసి ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఇక్కడ ఏర్పాటుచేసిన అనధికార షెడ్లలో పలు రకాల వ్యాపార సముదాయాలు పుట్టుకు రావడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 60 గజాల స్థలంలో పేదలు చిన్న గుడిసె వేసిన నాన్న రభస చేసి అది తీసివేసేంతవరకు వదలని బాచుపల్లి రెవెన్యూ అధికారులు ఏకంగా 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదా రులు తమ గుప్పిట



పెట్టుకొని అక్రమంగా విక్రయాలకు ప్రయత్నిస్తున్న పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాష్ట్రంలో అధికా రంలో ఉన్న నేత సోదరిని కుమారుడు ఒకరు సుమారు 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్ల ద్వారా చర పట్టి పూర్తిగా అందులో సింగిల్ రూమ్లో నిర్మించి నేటికీ అనుభవిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో అప్పటివరకు ఫిర్యాదులు చేయని ఒక మహిళ నాయకురాలు ఆ స్థలంపై అనంతరం పార్టీ మారి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడం కోసమెరుపు. రాజకీయ ఒత్తిడిలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాయడం, రెవెన్యూ అధికారులను అటువైపు రానీయకుండా చూసుకోవడం చేస్తున్న కబ్జాదారులు ఆ స్థలాన్ని బహిరంగంగా విక్రయానికి పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత పది సంవత్సరాల కాలంగా హైదర్ నగర్ పేరుతో తమ వద్దనున్న తప్పుడు సేల్ డీడ్ ఆధారంగా సుమారు 20 విద్యుత్ మీటర్లను కూడా కబ్జాదారులు సంపాదించినట్లు స్పష్టం అవుతుంది. పేరుకు స్థలం బాచుపల్లి రెవెన్యూ పరిధిలో ఉండగా కబ్జాదారుల రికార్డుల్లో మాత్రం అది కాస్త హైదర్ నగర్ గా చూపించడం గమనార్హం. నిజాంపేట్ లో రాజకీయంగా పేరుందిన ఒక నేత కను సన్నలలోనే ఈ తతంగం అంతా నడుస్తుందని స్థానికంగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా అత్యంత విలువైన 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని అందులో స్థానికులకు ఉపయోగపడే విధంగా దాన్ని వినియోగించాలని స్థానికుల కోరుతున్నారు.

సర్వే నెంబర్ 233/23, 24లలో13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి : ఆకుల సతీష్ నిజాంపేట గ్రామ సర్వేనెంబర్ 233/21, 22, 23, 24, 25, 26 ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలని నిజాంపేట్ కు చెందిన ఆకుల సతీష్ బుధవారం బాచుపల్లి తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. కొందరు అధికార పార్టీ నేతలు, మరికొందరు బిల్డర్లు కలిసి ఈ ప్రభుత్వ స్థలాన్ని విక్రయానికి పెట్టి 5 కోట్ల రూపాయలు టోకెన్ గా తీసుకున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై కోర్టులో కేసులు వేసి పలు పిటిషన్లు పెండింగ్లో ఉంచారని ఈ 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణలను ఖాళీ చేయించి ఫెన్సింగ్ వేసి ప్రజల ఉపయోగానికి వినియోగించాలని ఆయన కోరారు. ఆకుల సతీష్ వెంట ప్రసాద్, అరుణ్ రావు, నవీన్, రమేష్, పాండు తదితరులు ఉన్నారు.




# కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలి: నీలం పద్మ







**భువనగిరి, మార్చి 04, తెలంగాణ దిశ) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. భువనగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మహిళా నాయకులు వైట్ షర్ట్స్ ధరించి సిగ్నేచర్ క్యాంపెయిన్‌తో పాటు హోలీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జెఫ్రీ ఎప్స్టీన్ కేసు అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. చిన్నారులపై లైంగిక, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని మహిళా కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈమెయిల్ డేటా సేకరణ అంశం నేపథ్యంలో వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ వారి బృందాన్ని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ భువనగిరిలో సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ పావని, కవిత, మండల అధ్యక్షులు రజిత, టౌన్ ప్రెసిడెంట్ డి. కవిత, జిల్లా కమిటీ సభ్యులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, బ్లాక్, మండల, టౌన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్థాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై..వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది.పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమ తి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉ ంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితం లో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. అత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

## బిఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన మేడ్చల్ జిల్లా ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె రాజు



**కుత్బుల్లాపూర్, మార్చి 04, (తెలంగాణ దిశ):** ప్రజా పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సమక్షంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు బుధవారం బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ కొత్త నాయకులను కలుపుకొని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్, సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, రషీద్, లక్ష్మారెడ్డి, బట్ట పాలకృష్ణ, మైసి గారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ వార్.!

విజయనగరం, : భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అంశం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంపై టీడీపీ , వైసీపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్ట్ ఎక్కువగా ముందుకు వెళ్లిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అనుమతులు, కోర్టు వివాదాల పరిష్కారం, భూసేకరణ, శంకుస్థాపన అన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు అప్పుడే పూర్తయ్యాయని వైసీపీ వాదన.దీనికి టీడీపీ తీవ్రంగా స్పందిస్తోంది. ఒకప్పుడు జగన్ విపక్ష నేతగా ఉన్న సమయంలో భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అవసరమా అని ప్రశ్నించిన వీడియోలను బయటకు తీసి, అదే మీ అభివృద్ధి దృష్టికోణమా అంటూ కౌంటర్లు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతున్నప్పటికీ, ప్రాజెక్ట్ మాత్రం కీలక దశకు చేరుకుంది.ఇదిలా ఉండగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్ట్‌కు కొత్త ఉత్సాహం ఇచ్చాయి. ఢిల్లీ నుంచి వాణిజ్య విమానంలో నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయి ట్రయల్ రన్ విజయవంతం కావడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఎయిర్ ఇండియా (సహకారంతో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌లో తొలి విమానం దిగడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం కూడా విశేషమని పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి అనుమతులు 2016లోనే అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు తెచ్చారని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో పనులను వేగవంతం చేశామని చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సిన పనులను ఆరు నెలలు ముందుగానే పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

# డిజిటల్ మాయాజాలంలో ఆబాలగోపాలం!



కొన్నాళ్ల క్రితం నేను 'స్కూల్ హోం సపోర్ట్' అనే స్వచ్ఛంద సంస్థలో పని చేశాను. అప్పుడు ఫోన్లకు అతుక్కుపోతున్న పిల్లలపై ఆసక్తి కలిగింది. వారిని ఓపిగ్గా పరిశీలించాను. దీనికోసం చాలా పాఠశాలలు సందర్శించాను. నాకు కొట్టొచ్చినట్టు కనిపించిందేమంటే పిల్లలు తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. వీరికేమైంది?

పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతున్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూరమైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడుకోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. వారో కొత్త జాతిగా కనిపిస్తున్నారు. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరితనాలతో నిండిపోతోంది. తలచుకొంటే చాలా బాధేస్తోంది. ఇష్టంగా, క్రియాశీలంగా పాల్గొనేలా తరగతి గది, బడి వాతావరణమూ వున్నట్టయితే ఈ పిల్లలంతా ఎంతో రాణించే వారు. పరధ్యానంలో ఒక్క నిమిషమూ వుండేవారు కాదు. ఆన్‌లైన్లో వచ్చే చెత్తను చూస్తే వారికే అసహ్యం వేసేది. ఏ పుస్తకాలూ చదవకుండా, చుట్టూ ఏం జరుగుతుందో తెలియకుండా ఇలా పట్టాలు తప్పిన బండిలా వుండిపోయే వాళ్లే కాదు. చిన్నప్పుడు నాకు గనక స్క్రీన్లు, ఫోన్లు, టాబ్లెట్లు ఉన్నట్టయితే నా చదువు పూర్తిగా నాశనం అయ్యేది. పుస్తకాలు చదవడం అలవాటయ్యేదే కాదు. తీవ్రంగా నష్టపోయేదాన్ని. జీవితంలో నాకు దక్కిన గొప్ప బహుమతి ఏమిటంటే మనిషికి మనిషికీ మధ్య అనుబంధాన్ని పెంచే చదువు నాకు దక్కడం. మా టీచర్లతో మాకుండే గొప్ప అనుబంధం!

నిజానికీ బహుమతి పిల్లలందరికీ దక్కాలి. వాళ్ల సామర్థ్యాలన్నీ వెలికి రావాలి. వారి కోసం అపార జ్ఞానద్వారాలు తెరుచుకోవాలి. ఏ నాగరిక సమాజానికైనా ఇదీ అసలు లక్ష్యం! కానీ కళ్ళ ముందు జరుగుతున్న దంతా భిన్నంగా వుంది. బాధాకరంగా వుంది. మనం మన పిల్లలకు కావలసిందంతా ఇస్తున్నామనుకుంటున్నాం. విస్తృత ప్రపంచాన్ని వారి ముందు తెరిచి పెడుతున్నామనుకుంటున్నాం. మంచీ చెడూ వారే వింగడించుకోవాలనుకొంటున్నాం.

కానీ కొంచెం ఓపిక చేసుకుని చూడండి. మన పిల్లలు ఎంతగా మానసిక రుగ్మతకు లోనవుతున్నారో తెలుస్తుంది. ఒకసారి ఈ గణాం కాలు, అధ్యయనాలు చూడండి. మనం ఏ దరికి చేరుకొంటున్నామో అర్థమవుతుంది. యువతలో ఆత్మహత్యలు 2020 నాటికి అమ్మాయిల్లో 167 శాతం, అబ్బాయిలలో 91 శాతం పెరిగాయి. చెత్త తిండి వల్ల ఆసుపత్రుల్లో చేరే వాళ్ళు ఆరు రెట్లు పెరిగారు. టీనేజర్లలో ఆత్మహత్యా ప్రయత్నాలు ఐదింతలు పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ముగ్గురు బిడ్డల్లో ఒకరికి కంటి సమస్య (మయోపియా) తలెత్తుతోంది. ప్రపంచవ్యాప్తంగా మన చిన్నారుల్లో 100 కోట్ల మంది 2050 కల్లా ఈ మహమ్మారి బారిన పడబోతున్నారు.

దీనికి మొదటి ముద్దాయి మన సెల్‌ఫోన్! ఒకరకంగా ఇదంతా మనం తెచ్చిపెట్టుకున్న సమస్య. ఎక్కువ కాలం ఫోన్లపై గడపడం, బ్లూ లైట్లు, నిద్ర లేమి, ఆటల కొరత ఇవన్నీ మనం కోరి తెచ్చుకొన్నవి. కంటి జబ్బులతో ఇది ఆగడం లేదు. ఈ ఫోన్ల పుణ్యమా అని మన పిల్లలు డ్రగ్స్ బారిన పడుతున్నారు. హింసాత్మకంగా మారుతున్నారు. పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులొస్తున్నాయి. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించే మన చంటిపిల్లలు కూడా ఫోన్లకు అతుక్కు పోతున్నారు. కిటికీ లోంచి బయటికి చూడ్డం లేదు. అక్కడ వారికే కొత్త లోకమూ కనపడ్డం లేదు. విచిత్రంగా పసిబిడ్డలకు కూడా ప్రపంచం మూసుకుపోతోంది. ఇంతకంటే విషాదం ఇంకేముంటుంది? బ్రిటన్‌లో 'ఎడ్యు టెక్' కంపెనీల్లో కేవలం ఏడు శాతం మాత్రమే ప్రాథమిక పరీక్షలు జరిగాక తమ సామగ్రిని విడుదల చేస్తున్నాయి. ఇక 12 శాతం మాత్రమే ప్రామాణిక పరీక్షలకు నిలబడి నవి. మిగిలిందంతా ఇష్టారాజ్యపు సరుకు! మేము వైయంసిఏ గ్రౌండు దగ్గర పిల్లలకు కరాటే నేర్పుతాం. కొంతమంది పిల్లలు కరోనా కాలంలో రావడం మానేశారు. విచిత్రంగా కరోనా ముగిశాక కూడా వారు రావడం లేదు. కారణం ఏమంటే ఆటల సమయంలో కూడా వారు ఫోన్లకు అతుక్కుపోవడం. కోవిడ్ రోజుల్లో మనం చెప్పిన ఆన్‌లైన్ పాఠాలు కూడా వారిని మరింతగా ఫోన్లకు బానిసల్ని చేశాయి. మనకు తెలియకుండానే మన పిల్లలు మానసికంగా బలహీనులై పోయారు. టెక్నాలజీ ఏదో గొప్పదనీ, దీన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకందించాలనీ మనమనుకుంటే అది పిల్లల్ని బడికి, కుటుంబానికి, చివరకు స్వతంత్ర ఆలోచనలకు కూడా దూరం చేసింది.

ఒక్కసారివెనక్కి తిరిగి చూసుకుంటే నా ప్రియాతి ప్రియమైన ఉపాధ్యాయులతో నాకున్న అనుబంధానికెంతో గర్వపడుతున్నాను. జీవితంలో అదో గొప్ప బహుమతి నాకు. అందరు పిల్లలకీ అది దక్కాలి. వారందరూ ఎదగాల్సినంత ఎత్తు ఎదగాలి. ప్రతి నాగరిక సమాజలక్ష్యం అదేనని నేననుకుంటున్నాను. కానీ నా కళ్ళ ముందున్న సాక్ష్యాలు అలా కనపడ్డం లేదు. ఇప్పటికే మన పిల్లలు ప్రమాదపు టంచులకు చేరుకొన్నారు. మానసిక రోగగ్రస్తులుగా మారిపోయారు. కథ ఇక్కడితో ఆగడం లేదు. వారిలో హింసాప్రవృత్తి పెరుగుతోంది. ప్రలోభం, అశ్లీలం, భయానక దృశ్యాల్ని ఇష్టపడ్డం ఎక్కువవుతున్నాయి.




## ఐబిఎం స్కిల్స్‌బిల్డ్‌తో అవగాహన ఒప్పందం



కొడిమ్యాల: నాచుపల్లి లోనిజె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జగిత్యాల యు సి ఈ జె ళాశాల మరియు నాస్కామ్ ఐబిఎం స్కిల్స్‌బిల్డ్ సంస్థల మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నర్సింహ మాట్లాడుతూ, విద్యార్థులను పరిశ్రమ అవసరా లకు అనుగుణంగా తయారు చేయడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎమర్జింగ్ టెక్నాలజీలు, అడ్వాన్స్ ప్రోగ్రామింగ్ వంటి రంగాలలో ప్రాయోగిక అవగాహనతో పాటు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. నాస్కామ్ ఉ ఐబిఎం స్కిల్స్‌బిల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమతో అనుసంధానం వంటి అంశాలలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శ్రీనివాస్ గౌడ్ సహకారంతో నిర్వహించబడింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని కళాశాల యాజమాన్యం పిలుపునిచ్చింది. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ డా. . శ్రీనివాస్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. బి. సతీష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, వి.డి. ముడిమెల, సతీష్ రావు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే పరమార్థమైన మహా దాత..!



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉ ంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపా ధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్త వానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు.

అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళ పూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.

కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొతాప్రగడ శ్రీరామారావు (ప్లీడరు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు,


స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు.

తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. .

1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు.

ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉ ంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు..

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ



హైదరాబాద్, : ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూశాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణ లో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ..ఎసిబి స్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటు న్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయ కులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్ర తినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సంటేజీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను ఆక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు.

నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్‌శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటేజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖ లో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉ న్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. అక్రమా ర్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడు తున్నారు.

# అజరామరం... ఆ గానం!

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు.

తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు.

తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు.

# ఈ దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసిన త్యాగధనులు

మన ముందు తరాల వారిని, వారి జీవన శైలిని గమనిస్తే, మనకు చాలా విషయాలు అర్థమవుతాయి. ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలోకి మన ప్రయాణం ఎలా సాగుతూ వచ్చిందో తెలుస్తుంది! మన ముందు తరాలలో కొంతమంది, ఏ వృత్తిలో రాణించినా, వ్యక్తులుగా అద్వితీయంగా నిలబడ్డారు. శాస్త్ర వైజ్ఞానిక రంగంలోని కొంతమంది భారతీయుల జీవితాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే-వారు గొప్ప వ్యక్తులుగా, కళాకారులుగా, వైజ్ఞానికులుగా ఎలా నిలబడ్డారన్నది తెలిసిపోతుంది. వ్యక్తిత్వ వికాస దిశలో వారి పరిణతి అవగతం అవుతుంది. ఎక్కడా ఏ అవకాశమూ లేని రోజుల్లో-బీదరికంలో కొట్టుమిట్టాడుతూ కూడా ఏ చిన్న అవసరానికైనా వారు ఎంతగానో సంఘర్షించాల్సి వచ్చింది. వారి వైజ్ఞానిక పరిశోధనల గురించి తెలుసుకుంటూనే, వాళ్ళు వ్యక్తులుగా ఎలా మహోన్నతులయ్యారు? అనేది మనం గ్రహించాలి. మనం మన ముందు తరం వారికి తెలియజేస్తూ ఉండాలి!సాధారణ శకానికి పూర్వ ఆరవ శతాబ్దం (బిసిఇ)లో సుశ్రుతుడు ముందు చూపుతో శస్త్రచికిత్స పరికరాలు తయారు చేయకపోతే, ఆ తరువాత, ఆరు వందల ఏళ్ళకు చరకుడు ఆయుర్వేద గ్రంథాన్ని పరిష్కరించకపోతే, గణిత శాస్త్రంలో వర్గం, వర్గమూలం, ఘనం, ఘన మూలం, త్రిభుజ వైశాల్యం మొదలైనవన్నీ ఆర్యభట్ట ప్రస్తావించకపోతే –మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్ళం కాదు. కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు లేని కాలంలో, ఆర్యభట్ట అంతటి విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా గ్రంథస్థం చేయగలిగాడన్నది ఎంతో విస్మయం కలిగించే విషయం. రాహుకేతువులు సూర్యచంద్రులను మింగివేయడం వల్ల గ్రహణాలు సంభవిస్తున్నాయని అందరికందరూ భావిస్తున్న రోజుల్లో-సూర్యగ్రహణం చంద్రుడి వలన, చంద్రగ్రహణం భూమి నీడ వలన సంభవిస్తున్నాయని ఆర్యభట్ట చెప్పాడు. పదిహేను వందల ఏళ్ళకు పూర్వమే ఆయన ఈ జ్ఞానాన్ని అందించినా, ప్రజలు నేటికీ గ్రహణాలకు భయపడుతున్నారు- అజ్ఞానులైన జ్యోతిష పండితుల-స్వార్థపరులైన మనువాదుల- బ్రాహ్మనిజపు వికృత క్రీడల్లో-ఇది ఒకటి అయ్యింది!పదవుల కోసం పాకులాడే యూనివర్సిటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు ప్రఫుల్ల చంద్ర రే (1861–1944) జీవితం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. మహాత్మా గాంధీ అంతటివాడు అతణ్ణి వెతుక్కుని వెళ్ళి నమస్కరించాడు. అతనికి వచ్చే ఎనిమిది వందల జీతంలో కేవలం నలభై రూపాయలు స్వంత ఖర్చులకు ఉంచుకుని, మిగిలినదంతా ప్రజల కోసం ఖర్చు చేసినవాడు పి.సి.రే. ఆ నాటి పరిస్థితులను గమనించి 'సైన్స్ కెన్ వెయిట్. బట్ స్వరాజ్ కెనాట్–అనే నినాదంతో స్వాతంత్రోద్యమంలోకి దూకిన శాస్త్రవేత్త ఆయన!"భారతరత్న ఇచ్చారు కదా అని ఎప్పుడూ మీ ప్రభుత్వాన్ని పొగడుతూ ఉంటానని అనుకోవద్దు. వాస్తవాలు కచ్చితంగా బయటపెడుతూ ఉంటాను."– అని నెహ్రూ అంతటి వాడితో నిక్కచ్చిగా వ్యవహారం నడిపినవాడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య (1861–1962). ఆర్భాటాలకూ, ప్రచారాలకూ విలువ ఇవ్వకుండా సామాన్యుల్లో సామాన్యుడిగా బతికిన దేవేంద్ర మోహన్ బోస్ (1885–1975)కు ఒక దశలో నోబెల్ పురస్కార గ్రహీత పావెల్ వినమ్రంగా ఎందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడూ? పోర్ట్ ట్రస్ట్‌లో గుమస్తాగా పనిచేసే శ్రీనివాస రామానుజన్ (1887–1920) గణితశాస్త్ర సూత్రీకరణలు ఎలా చేయగలిగాడు? విదేశాలలో చదవకుండానే, ప్రపంచంలోని పెద్ద పెద్ద ప్రయోగశాలలు సందర్శించాకుండానే, తనకు తానుగా కాకలుతీరిన శాస్త్రవేత్తగా తయారై, నోబెల్ సాధించగలగడం సి.వి.రామన్ (1888–1970)కు ఎలా



సాధ్యమైంది? వంటి విషయాలు తెలుసుకుంటే ఆనాటి మహనీయుల వ్యక్తిత్వాలు స్పష్టంగా అర్థమవుతాయి. రికార్డుల కోసం వెర్రి మొర్రి పనులు చేస్తున్న నేటి యువతరం, రామన్ జీవితం లోని రికార్డులను ఛాలెంజ్ చేయగలరేమో తేల్చుకోవాలి! ఆయన ఆర్థిక శాఖలో ఉద్యోగం చేస్తూ భౌతిక శాస్త్రంలో నోబెల్ స్థాయి పరిశోధనలు చేశారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే, చాలా వాటిని వదులుకోక తప్పదు-అన్నది ఆయన జీవితం చెప్తుంది. కరువులు ఎందుకొస్తాయీ? తుపానులు ఎందుకొస్తాయి? దారిద్ర్యానికి అంతం ఎక్కడా? అని బాల్యంలోనే ఆలోచించిన మేఘనాథ్ సాహా, ఆ తరువాత కాలంలో దేశ వైజ్ఞానిక ప్రగతికి దోహదపడే ప్రణాళికల్ని తయారుచేయగలిగాడు. 1893–1956 మధ్యకాలంలో జీవించిన సాహా, ప్రాచీన తాళపత్ర గ్రంథాల అధ్యయనం కూడా కొనసాగించారు. శాస్త్రవేత్తలు కనుగొన్న వైజ్ఞానిక అంశాలు విద్యాలయాల్లో బోధిస్తారుగానీ, వారి వ్యక్తిత్వం, వారి త్యాగాలు, వారు చేసిన దేశ సేవ గురించి పాఠాలలో చెప్పరు. అసలైతే అవి కూడా చెప్పడం అవసరం. భావితరాల్ని మానవవాదులుగా మార్చాలంటే అలాంటి విషయాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. ఎవరైనా సరే, వ్యక్తులుగా ఎదిగినప్పుడే మానవాళికి ఉపయోగపడే అద్భుతాల్ని సాధిస్తారు. వారు శాస్త్రవేత్తలయినా, కవులైనా, గాయకులైనా, తత్వవేత్తలైనా, చిత్రకారులైనా ఎవరైనా సరే-ఒక స్థాయిని అందుకోవడం కష్టం! అందుకున్నాక సైన్సు, కళలు, సామాజిక, ఆర్థిక అంశాల మధ్య అడ్డుగోడలు తొలగిపోయి-అన్నీ ఒకే పరిధిలో కనిపించడం విశేషం!అన్ని స్థాయిల్లోని విద్యాలయాల్లో, కార్యాలయాల్లో, పౌర సమాజాల్లో ఈ కింది రోజుల్ని ఘనంగా నిర్వహిస్తూ ఉండాలి. అప్పుడు మనిషి కేంద్రంగా హేతుబద్ధంగా ఆలోచనలు పెరుగుతాయి. నేషనల్ సైన్స్ డే (28 ఫిబ్రవరి), హ్యూమనిస్ట్ డే (21 జూన్), ప్రపంచ తాత్వికతా దినం (3వ గురువారం నవంబర్ 19), ఎవల్యూషన్ డే (నవంబర్ 24), వైజ్ఞానిక స్పృహ దినోత్సవం (ఆగష్టు 20) వంటి వాటిని ఇతర జాతీయ పండగలతో పాటు జరపనారంభిస్తే-మత పునాదుల మీద అసంబద్ధంగా ఏర్పడి కొనసాగుతున్న అబద్ధాల పండుగలు అంతరిస్తాయి. పౌరుల్లో విశాల దృక్పథం అలవడుతుంది! ప్రభుత్వాలు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్న విద్వేష భావనని తిప్పికొడతారు. మానవ జాతి అంతా ఒకటేనన్నది గ్రహిస్తారు! అందరూ విశ్వమానవులవుతారు!!

# మండే కాలం!

వేసవి రాకముందే రాష్ట్రంలో ఎండలు మండుతున్న తీరు చర్చనీయాంశంగా మారింది. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో 35 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం నాడు పలు రాయలసీమ జిల్లాలతో పాటు, కోస్తా జిల్లాల్లో కూడా 35 నుండి 36 డిగ్రీల గరిష్ట ఉషోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసినప్పటికీ అత్యధిక జిల్లాల్లో సూర్య ప్రతాపమే కొనసాగింది. వాతావరణ శాఖ జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ ఏడాది మార్చి నెలలో వేసవి కాలం ప్రారంభమై మే నెలాఖరు వరకు కొనసాగాల్సి ఉండగా ఫిబ్రవరి నెలలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకరం. కొన్ని సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా వాతావరణంలో ఈ తరహా మార్పులు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం భారతదేశ చరిత్రలో అత్యంత వేడి నమోదైన సంవత్సరాల్లో ఒకటిగా నిలిచింది. ఆ సంవత్సరం మన రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత సుమారు 1 నుండి 1.5 డిగ్రీల వరకు అధికంగా నమోదైనట్లు వాతావరణ విభాగ విశ్లేషణలు చెబుతున్నాయి. గత ఏడాది (2025)లో అనంతపురం, కర్నూలు, నంద్యాల, గుంటూరు జిల్లాలో 45 నుండి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, మార్చి నెల మధ్యలోనో, ఏప్రిల్ ప్రారంభం నుండో మండే ఎండలు ఈ సారి ఫిబ్రవరిలోనే ప్రారంభం కావడం ముందస్తు హెచ్చరికగా భావించక తప్పదు. అయితే, ఇది కేవలం ఒకటి, రెండు సంవత్సరాల్లో చోటుచేసుకున్న వైపరీత్యమనుకుంటే పొరపాటు. ఒక అధ్యయనం ప్రకారం 2010 తరువాత ప్రతి ఐదు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. వడ గాలుల తీవ్రత, అవి కొనసాగే కాలవ్యవధి పెరుగుతోంది. ఆ క్రమంలోనే 2024 వేసవిలో దేశవ్యాప్తంగా వడదెబ్బ కేసులు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాల ప్రకారం, దేశ వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా వందల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. మన రాష్ట్రంలో కూడా గత వేసవిలో వడదెబ్బ కారణంగా రెండు డజన్లకు పైగా మరణాలు నమోదైనట్లు సమాచారం. ఇటువంటి ఉత్పాతాలు కేవలం వైద్య, ఆరోగ్య పరమైన అంశాలనే కాదు. సామాజిక అసమానతల్ని కూడా బట్టబయలు చేస్తాయి. నిర్మాణరంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికులు, రోడ్లపై చిన్నా చితక పనులు చేస్తూ పొట్ట పోసుకునే కష్టజీవులే వడదెబ్బ, వేడి గాలుల బాధితుల్లో అధిక సంఖ్యలో ఉండటం ఈ వాస్తవాన్నే విదితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నమోదుకాని మరణాలు, చికిత్సకు నోచుకోని బాధితుల సంఖ్య ఇంకా హెచ్చుగా ఉంటుంది. ఈ గణాంకాలన్నింటిని సేకరిస్తే తప్ప అత్యధిక ఉష్ణోగ్రతల వాస్తవ ప్రభావం ఎంత? అసమానతల గాఢత ఎంత అన్నది స్పష్టం కాదు.

ఉష్ణోగ్రతలు పెరగడం, ఫలితంగా వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకోవడమన్నది ఇక ఎంతమాత్రం భవిష్యత్ కాలపు హెచ్చరిక కాదు. వర్తమానపు వాస్తవంగా ఆ విపత్తు మన కళ్లముందే నిలుస్తోంది. దీనిని అర్థం చేసుకోవడం నివారణ చర్యలు తీసుకోవడం ఇప్పుడు తప్పనిసరిగా మారిన ఒక సామాజిక బాధ్యత. ఉష్ణోగ్రతలు ఏటికేడాది వరుసగా రికార్డులు బద్దలు కొడుతూ, మరణాల సంఖ్య పెరుగుతుండగా, పాలనా వ్యవస్థలు మొక్కుబడి చర్యలకు పరిమితం కావడం ఇక ఏమాత్రపు క్షమార్హం కాదు. పెరిగే ఎండలు ప్రజలకు తాగునీరు, సాగునీటి అవసరాల పైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. భూగర్భజలాలు తీవ్రంగా క్షీణించడం, విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. వీటిని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం తక్షణం వేసవి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి. ఈ యాక్షన్ ప్లాన్లు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయి వరకు అమలయ్యేలా చూడాలి. ముందస్తు హెచ్చరికలు, పనివేళల్లో మార్పులు, తాగునీటిని అందుబాటులో ఉంచడం, గ్రీన్ కవర్ పెంచడం, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతుందన్నది అనేక దేశాల్లో, కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికే నిరూపితమైన సత్యం. ప్రభుత్వం ఈ విషయమై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి సంవత్సరం చోటుచేసుకుంటున్న ఈ వైపరీత్యాన్ని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు.

# భారత ప్రామాణిక కాలమానం అమలు

1906, జనవరి 1 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు-ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశంను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం ( ఉజ్జయినికి (23ళీ10ః58?చీ 75ళీ46ః38జు / ?23.18278ళీచీ 75.77722ళీ), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ళీ54ః చీ 76ళీ38ఃజు/ ?28.900ళీచీ 76.633ళీజు) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ళీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించబడలేదు. భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన

# బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్...



మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# కొత్త రికార్డులతో బంగారం, వెండి దూకుడు



పెట్టుబడిదారుల నుంచి అధిక గిరాకీకి తోడు మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు చారిత్రాత్మక గరిష్టాలకు చేరాయి. ఫ్యూచర్ ట్రేడింగ్‌లో కిలో వెండి 6 శాతం పెరిగి రూ. 4 లక్షల మైలురాయిని దాటగా, బంగారం ధర రూ. 1.79 లక్షలుగా నమోదైంది. కొనుగోలుదారుల డిమాండ్ కారణంగా రూ. 11 వేలకు పైగా పెరిగి, పద్ గ్రాముల బంగారం ధర రూ. 1,78,850తో కొత్త గరిష్టాలను నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లోను బంగారం ఫ్యూచర్స్ తొలిసారి ఔన్స్‌కు 5,600 డాలర్ల కీలక మార్కును దాటి 5,627.50 డాలర్లను నమోదు చేశాయి. పారిశ్రామిక డిమాండ్ పెరగటం, అమెరికా డాలర్ బలహీనపడటమే వెండి రికార్డు ధరలకు కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన బంగారం పది గ్రాములు రూ. 11,770 పెరిగి రూ. 1,78,850కి చేరింది. ఆభరణాల తయారీలో ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 10,800 పెరిగి రూ. 1,63,950 వద్ద ఉంది. వెండి కిలో ఏకంగా రూ. 25 వేలు పెరిగి రూ. 4.25 లక్షలుగా నమోదైంది. గ్లోబల్ మార్కెట్లో వెండి ఔన్స్ ధర 120.56 డాలర్లుగా ఉంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేసిన ఆర్థిక సర్వేలో దేశ జీడీపీ వృద్ధి 6.8-7.2 శాతంగా ఉంటుందని అంచనా వేయడంతో స్టాక్ మార్కెట్లలో ర్యాలీ కనిపించింది.

# మైక్రోసాఫ్ట్ సంస్థకు రూ.36 లక్షల కోట్ల నష్టం




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలను చవిచూసింది. కొన్ని గంటల్లోనే కంపెనీ వాల్యుయేషన్‌లో 12 శాతం నష్టపోగా, దాని విలువ 400 బిలియన్ డాలర్లకు పైగా పడిపోయింది.భారతీయ కరెన్సీలో ఇది రూ.36 లక్షల కోట్లకు సమానం. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒకే రోజులో ఇది రెండో అతిపెద్ద నష్టంగా నమోదైంది.గత ఏడాది జనవరిలో ఎన్విడియా 593 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వాల్యుయేషన్ పతనానికి గ్లోబల్ మార్కెట్ ఒత్తిళ్లు, పెట్టుబడిదారుల లాభాల స్వీకరణ, భవిష్యత్ ఆదాయ అంచనాలపై అనిశ్చితి వంటి అంశాలు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టెక్ రంగంపై పెరుగుతున్న పోటీ కూడా ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. ఈ ఒక్కరోజు నష్టం ఉన్నప్పటికీ, మైక్రోసాఫ్ట్ యొక్క దీర్ఘకాలిక వ్యాపార బలం పటిష్టంగానే ఉందని కొందరు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రాబోయే త్రైమాసిక ఫలితాలు కంపెనీ షేర్ దిశను నిర్ణయించే కీలక అంశంగా మారనున్నాయి.

# ఒక్కసారిగా దిగొచ్చిన బంగారం ధరలు



ఇటీవల కాలంలో సామాన్యులకు బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న పరిణామాలు, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో దేశీయంగా బులియన్ మార్కెట్‌లో ధరలు భారీగా పతనమయ్యాయి. దీంతో ఇవాళ హైదరాబాద్‌లియన్ మార్కెట్‌లో ఒక్క రోజులోనే 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారంపై రూ.8,230 తగ్గి రూ.1,70,620 వద్ద కొనసాగుతోంది.


ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్స్ బంగారం ధరపై రూ.7,550 తగ్గుదల కనిపించింది. దీంతో 10 గ్రాముల ధర రూ.1,56,400కి చేరింది. అదేవిధంగా బంగారంతో పోటీ పడుతూ పరుగులు పెట్టిన వెండి ధర కూడా నేడు భారీగా క్షీణించింది. కిలో వెండిపై ఏకంగా రూ.10 వేల మేర తగ్గింది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 4,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్ విలువలో మార్పులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలు, అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన అమ్మకాల ఒత్తిడి కారణంగానే ఈ భారీ తగ్గుదల నమోదైనట్లుగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ఈ ధరల తగ్గుదల మధ్యతరగతి వినియోగదారులకు, పసిడి ప్రియులకు పెద్ద ఊరటనిచ్చే అంశమే.

# ఈసారి జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం!



రాబోయే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఎదుర్కోవాల్సిన సవాళ్లను అంచనా వేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఎకనమిక్ అఫైర్స్ విభాగం దీన్ని రూపొందిస్తుంది. 1950 నుంచి దీన్ని బడ్జెట్‌తో పాటే అందిస్తున్నప్పటికీ 1960 తర్వాత నుంచి బడ్జెట్ ప్రకటనకు ఒకరోజు ఉండగా సభ ముందుంచుతున్నారు. ఆర్థిక సర్వే దేశ ఆర్థికవ్యవస్థ ముందుకెళ్లేందుకు, గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన మార్పులను పరిగణలోకి తీసుకుని, సమీక్షిస్తూనే భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.8 శాతం నుంచి 7.2 శాతం పరిధిలో వృద్ధి చెందుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇది ఇటీవల గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 7.4 శాతం వృద్ధి కంటే కొద్దిగా తగ్గింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో సమర్పించారు. కేంద్ర బడ్జెట్ వెలువరించేందుకు ఒకరోజు ముందు సాంప్రదాయంగా వస్తున్న ఆర్థిక సర్వే ఈసారి రెండు రోజుల ముందు సభలో ఉంచారు. ఈసారి బడ్జెట్ ప్రకటన వారాంతం వస్తుండటంతో ఆర్థిక సర్వేను ముందుగానే ప్రవేశపెట్టారు. గడిచిన ఏడాది కాలానికి సంబంధించి దేశ ఆర్థికవ్యవస్థ పనితీరు, భవిష్యత్తు కోసం కీలకమైన అంచనాలు, విధాన పరమైన సూచనలను ఈ అర్వే అందిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గతేడాది ఆర్థిక సర్వే జీడీపీ వృద్ధిని 6.3 శాతం నుంచి 6.8 శాతం పరిధిలో అంచనా వేసింది. అయితే, అధిక వినియోగం, ప్రభుత్వ పెట్టుబడుల కారణంగా వాస్తవ జీడీపీ వృద్ధి అంతకుమించి ఉండే అవకాశం ఉంది.

# ఆర్‌బిఐ నియామకాలు..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్పూర్ శాఖలో ఖాళీగా ఉన్న మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన విడుదల చేసింది. మొత్తం మూడు పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించింది. వైద్య రంగంలో అనుభవం ఉండి, కేంద్ర బ్యాంక్‌లో పనిచేయాలనుకునే అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశమని చెప్పవచ్చు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఓఃబీ లేదా జనరల్ మెడిసిన్‌లో పీజీ పూర్తి చేసి ఉండాలి. విద్యా?ర్హతలతో పాటు సంబంధిత విభాగంలో కనీసం కొంత పని అనుభవం ఉండటం తప్పనిసరి.

# తిరిగి రష్యా చమురు కొనుగోలు చేయనున్న రిలయన్స్...

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ మళ్లీ రష్యా చమురు కొనుగోళ్లను ప్రారంభించనుంది. కంపెనీకి చెందిన జామ్‌నగర్‌లోని కాంప్లెక్స్ తిరిగి ఫిబ్రవరి నుంచి రోజుకు 1,50,000 బ్యారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేయనుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో రిలయన్స్ ఈ కంపెనీలతో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందాల కింద కొనుగోలు చేయడం కష్టంగా మారింది. రిలయన్స్ ఎగుమతులు, చెల్లింపులు, గ్లోబల్ వ్యాపారంలో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. దీంతో డిసెంబర్ తర్వాత రిలయన్స్ రష్యా చమురు కొనుగోలు చేయడం నిలిపేసింది. తాజాగా రిలయన్స్ అమెరికా ఆంక్షల కింద లేని రష్యా కంపెనీల నుంచి ముడిచమురు కొనుగోలు చేయనున్నట్టు చెబుతోంది.



# ఒక్క రూపాయి లాభం చూపించి కోట్లు కొట్టేశారు!




**ఈ ఏడాది మొదటి రోజే రూ. 4.5 కోట్లు కొట్టేసిన సైబర్‌చీటర్స్**

హైదరాబాద్: సైబర్‌నేరాలు తగ్గుతున్నాయని ఒక పక్క అధికారులు చెబుతున్నా.. మరో పక్క నేరగాళ్లు పంజా విసురుతూనే ఉన్నారు. ఈ ఏడాది మొదటి రోజే మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 4.5 కోట్లు కొట్టేశారు. స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయని నమ్మిస్తూ× (స్కీన్‌పై రూ.కోట్ల లాభం చూపించి.. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే ట్యాక్స్‌లు చెల్లించాలని నమ్మిస్తూ రూ.కోట్లు కాజేశారు. మోసపోయిన వారిలో ఒకరు వ్యాపారి కాగా× మరొకరు డిఫెన్స్ సంస్థలో పనిచేసిన రిటైర్డు అధికారి కావడం గమనార్హం.తన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, తెలిసిన వారు, బంధువుల వద్ద అప్పులు తెచ్చి ఇందులో పెట్టుబడి పెట్టగా ఒక్క రూపాయి లాభం చూపించి సైబర్‌నేరగాళ్లు కోట్లు కొట్టేశారు. పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నివాసముండే వ్యాపారి గత ఏడాది నవంబర్‌లో ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తుండగా ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ప్రకటన కన్పించింది. దానిని క్లిక్ చేయడంతో నోమురా సెక్యూరిటీస్‌కు సంబంధించి నోముజీక్యూ ఐ-189 పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌కు బాధితుడి నెంబర్‌ను యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లో ఉన్నవారు స్టాక్స్ గురించి చర్చించుకుంటూ మేం ఫలాన స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే ఇన్ని లాభాలొచ్చాయని చెప్పుకుంటూ (స్కీన్ షాట్స్ షేర్ చేశారు. దీంతో తాను కూడా ట్రేడింగ్ చేసేందుకు ముందుకెళ్లాడు. ఈ నేపథ్యంలోనే సైబర్‌నేరగాళ్లు పంపించిన హెచ్5.ఏఆర్ఏవైఏఏ.ఆఆ పేరుతో పంపించిన లింక్‌ను క్లిక్ చేసి, యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అకౌంటర్ క్రియేట్ చేసుకున్నాడు. బాధితుడికి కావ్యారెడ్డి అనే పేరుతో ఒక చీఫ్ అపరేటర్, అడ్వయిజర్‌ను కేటాయించారు. దీంతో మొదట రూ.40 వేలు పెట్టుబడి పెట్టడంతో కొన్ని లాభాలు కన్పించాయి. వాటిని విత్‌డ్రా చేసుకున్నాడు. మీరు ఇలా చేస్తే ఎక్కువ లాభాలు రావని, క్యూ1బీ క్యాటగిరిలో ఐపీవోలు, హైనెట్ వర్త్ స్టాక్స్‌పై పెట్టుబడి పెడితే భారీ లాభాలు ఆర్జించవచ్చంటూ సూచనలు చేశారు. ఇలా రూ.49.6 లక్షలు పెట్టుబడి పెట్టడంతో యాప్‌లు పెట్టుబడితో పాటు లాభాలు రూ.1.68 కోట్లుగా కన్పించాయి. దీంతో భారీ లాభాలొస్తాయంటూ నమ్మించారు. తరువాత దఫ దఫాలుగా రూ. 2 కోట్ల వరకు పెట్టుబడి పెడుతూ వెళ్లాడు. (స్కీన్‌పై రూ.9.28 కోట్ల లాభం కన్పించింది. (స్కీన్‌పై కన్పిస్తున్న లాభాలు, పెట్టుబడులలో నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో సైబర్‌నేరగాళ్లను ప్రశ్నించాడు. ముందుగా మీరు రూ. 80.67 లక్షలు కమిషన్ చెల్లించాలని, ఆ తరువాతే మీకు విత్ డ్రా చేసుకునే అవకాశముంటుందని సూచించారు. అయితే వ్యాలెట్‌లో ఉన్న వాటిలో అవి మినహాయించుకొని మిగతావి ఇవ్వాలని బాధితుడు కోరితే.. అలా కుదరదని ముందుగా కమిషన్ చెల్లించాలని షరత్ విధించడంతో బాధితుడికి అనుమానం వచ్చి ఈ నెల 1వ తేదీన మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రిటైర్డు డిఫెన్స్ ఉద్యోగికి టోకరా: కాప్రా ప్రాంతంలో నివాసముండే బాధితుడు డిఫెన్స్ సంస్థలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. టెలిగ్రామ్ యాప్‌ను బ్రౌజింగ్ చేస్తుండగా ఏపీ హెల్పింగ్ హ్యాండ్ ఇండియా పేరుతో ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌ను క్లిక్ చేయడతో తాము స్టాక్ ట్రేడింగ్‌లో విశ్లేషణ, స్టాక్స్ కొని అమ్మడంలో కస్టమర్‌కు సూచనలు, రిస్క్ మేనేజ్‌మెంట్ చేస్తూ అధిక లాభాలిప్పిస్తామని ఒక అప్లికేషన్ కన్పించింది. అందులో రిజి(స్టేషన్ చేసుకున్న బాధితుడికి అమన్‌కుమార్ పేరుతో ఒక వ్యక్తి ఫోన్ చేసి కొన్ని సూచనలు చేశాడు, ఆ తరువాత బేస్ ఫార్మలీ కాయిన్ బేస్ వ్యాలెట్ పేరుతో ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. క్రిప్టో కరెన్సీతో బియాన్స్‌లో ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలొస్తాయని నమ్మించాడు. ఈ మేరకు ఆ యాప్‌లో అకౌంట్ క్రియేట్ చేసుకొని ట్రేడింగ్ మొదలు పెట్టాడు. దీనికి అమన్‌కుమార్‌తో పాటు అజిత్ దోవల్ అనే పేర్లతో ఇద్దరు వ్యక్తులు సలహాలు, సూచనలు ఇస్తూ వెళ్లారు. మీరు పెట్టే పెట్టుబడిని రూపాయు నుంచి యుఎస్‌డీటీలోకి మార్చి, మీ వ్యాలెట్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుందంటూ సూచనలు చేశారు. ఇదంతా ఇండియా, యూఎస్-ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌పై ఆధారపడి ఉంటుందని నమ్మించారు. ఇలా బాధితుడు మొదట రూ. 3.85 లక్షలు పెట్టుబడి పెట్టడంతో కొన్ని లాభాలు చూపించారు. ఆ తరువాత మరో మూడు లక్షలు పెట్టుడి పెట్టాడు. అయితే యాప్‌లో (స్కీన్‌పై రూ. 4.55 కోట్లు (5 లక్షల యుఎస్‌డీటీ) చూపించింది. అందులో ఉన్న వాటిని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించడంతో మీ లాభాలు అధికంగా ఉన్నాయని, అందుకే ప్రాఫిట్‌పై 30 శాతం ట్యాక్స్ చెల్లించాలని షరత్ విధించారు. దీంతో బాధితుడు రూ. 12.97 లక్షలు చెల్లించాడు, ఆ తరువాత రూ. 50 లక్షలు చెల్లిస్తూ వెళ్లాడు. ఇలా 494 సార్లు× రూ. 2,27,85,000 సైబర్‌నేరగాళ్లు సూచించిన ఖాతాలలోకి డిపాజిట్ చేశాడు. ఇందులో ఒక్క రూపాయి మాత్రమే తనకు లాభం అంటూ సైబర్‌నేరగాళ్లు ఇచ్చారని, తన రిటైర్ బెనిఫిట్స్‌తో పాటు బంధువులు, తెలిసిన వారి వద్ద అప్పులు తెచ్చి సైబర్‌నేరగాళ్లు సూచించినట్లు డిపాజిట్ చేశానని బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## గుండె.. కొన్ని జాగ్రత్తలు



గుండె సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోవడం వల్ల రక్త నాళాలు సంకోచిస్తాయి. గుండెపై అదనపు ఒత్తిడి పెరిగి ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. కాబట్టి తగిన ఉష్ణోగ్రత ఉన్న గదుల్లో ఎక్కువ గడపాలి. శరీర ఉష్ణోగ్రత 95 డిగ్రీల కంటే తక్కువగా ఉంటే, గుండె కండరాలకు హాని కలిగించే అల్పోష్ణస్థితికి గురవుతారు. చల్లని వాతావరణంలో ఎక్కువ సమయాన్ని గడిపేవారు, రక్తపోటు, డయాబెటిస్, అధిక కొలె(స్టాల్ సమస్యలున్నవారు, ధూమపానం, పొగాకు తీసుకునే వారికి ఈ స్థితి ఇబ్బందికరం. ఇలాంటి వారు శీతాకాలంలో ఎక్కువ శ్రమించాలి. వెచ్చగా ఉండటానికి ప్రయత్నించాలి. ఉన్ని బట్టలు, టోపీలు, గ్లౌజులు, సాక్సులు ధరించాలి. చల్లని వాతావరణంలో వ్యాయామం చేయొద్దు. ఇండోర్ వ్యాయామాలను ఎంచుకోవాలి. గుండెకు ఒత్తిడి కలిగించే వ్యాయామాలూ చేయొద్దు. మద్యపానం, ధూమపానం పూర్తిగా మానేయాలి. ఆల్కహాల్ చర్మంలోని రక్త నాళాలకు విస్తరించి, శరీరంలోని ముఖ్యమైన అవయవాల నుంచి వేడిని తీసుకుంటుంది. ధూమపానం గుండె వైపు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గిస్తుంది. హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతుంది. ఈ కాలంలో తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, కాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. భోజనం, సూప్ వేడివేడిగా తీసుకుంటూ ఉండాలి. ఉప్పు, చక్కెర బాగా తగ్గించాలి. జంక్‌ఫుడ్ పూర్తిగా మానేయాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుంది.

## మసీదు వద్ద అక్రమ నిర్మాణాల కూల్చివేత..

**ఢిల్లీలో గాయపడ్డ అయిదుగురు పోలీసులు**



న్యూఢిల్లీ: ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ సమీపంలో మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. సయ్యద్ ఫైజ్ ఇలాహీ మసీదు వద్ద నిర్మాణాలను తొలగిస్తున్న(ణవఎశిశ్రీ‌ఉఅశీఅ ణతీఱజవ) సమయంలో హింస చోటుచేసుకున్నది. కూల్చివేతలను అడ్డుకుంటూ కొందరు పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో అయిదుగురు పోలీసులు గాయపడ్డారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకా రం మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. కూల్చివేత ప్రదేశంలో గుంపును చెదరొట్టేందుకు టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించినట్లు ఢిల్లీ పోలీసులు ఓ ప్రకటనలో చెప్పారు. ఈ ఆపరేషన్ సమయంలో కొందరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. దీంతో సైట్ వద్ద గందరగోళం ఏర్పడింది. అయితే భద్రతా సిబ్బందితో పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు ఢిల్లీ పోలీసులు చెప్పారు. జనవరి ఆరో తేదీ రాత్రి నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ చేపట్టినట్లు డీసీపీ నిధిన్ వాల్సన్ తెలిపారు. డెమోలిషన్ సిబ్బంది సైట్ వద్ద ఉన్న సమయంలో సుమారు 150 మంది అక్కడకు చేరుకున్నారు. ఎంసీడీ మెషీన్లు, జేసీబీలతో కూల్చివేత చేపట్టారు. రాళ్ల దాడిలో గాయపడ్డ పోలీసులకు చికిత్స అందిస్తున్నారు. మెడికల్ నివేదిక వచ్చిన తర్వాత లీగల్ చర్యలు చేపట్టనున్నట్లు డీసీపీ వెల్లడించారు. సీసీటీవీ ఫూటేజ్‌ను విశ్లేషిస్తున్నామన్నారు. మసీదు వద్ద బాంకెట్ హాల్, డిస్పెన్సరీ అక్రమంగా నిర్మించినట్లు ఎంసీడీ అధికారులు చెప్పారు. ఆ నిర్మాణాలను చట్టవ్యతిరేకమని కూడా కోర్టు చెప్పింది. అయితే డ్రైవ్ సమయంలో ఆ నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు.



# చమురు పైనే చూపంతా!

**ప్రపంచంలోనే అత్యధికంగా వెనెజువెలాలో ఆయిల్ రిజర్వ్స్ వాటిని చేజిక్కించుకునేందుకే అమెరికా దాడి అన్న నిపుణులు**

న్యూఢిల్లీ: వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అరెస్ట్ చేయడానికి కారణంగా డ్రగ్స్ బూచిని చూపిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసలు లక్ష్యం ఆ దేశంలోని భారీ చమురు నిక్షేపాలను కొల్లగొట్టడమేనని విశ్లేషకులు అంటున్నారు! అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మదురో నియంత, కిరాతకుడు అనే మాట నిజమే కానీ, ప్రెసిడెంట్ ట్రంప్ చేసిన పని చట్టవిరుద్ధం, నిర్లక్ష్యపూరితం అని విమర్శించారు. యూఎస్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇచ్చిన పోస్ట్‌లో, వేరొక దేశంపై దాడి చేసే అధికారం ట్రంప్‌నకు లేదని పేర్కొన్నారు. ఇప్పుడు తన నియంత్రణలో ప్రపంచంలోనే భారీ చమురు నిక్షేపాలు ఉన్నాయని, వీటి విలువ రూ.1,557 లక్షల కోట్లు అని ట్రంప్ మీడియాకు తెలిపారు. అమెరికాకు చెందిన పెద్ద ఆయిల్ కంపెనీలు వెనెజువెలాకు వెళ్తాయని, బిలియన్ల డాలర్లు ఖర్చుపెట్టి, సొమ్ము సంపాదించుకుంటాయని చెప్పారు.

వెనెజువెలాలో ఎంత చమురు ఉంది?: అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మిని(స్టేషన్ ప్రకారం, వెనెజువెలాలో 300 బిలియన్ బ్యారెళ్ల కన్నా ఎక్కువ చమురు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం చమురు నిల్వల్లో ఇది 20 శాతం. దీని విలువ రూ.1,557 లక్షల కోట్లు అని అంచనా. ఈ చమురు హెవీగా ఉంటుంది, విద్యుదుత్పత్తి కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, నౌకలు, రోడ్డు నిర్మాణం, వాటర్‌ప్రూఫింగ్‌ల కోసం కూడా వాడతారు. అమెరికాకు 50 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఇది లైట్, స్వీట్ క్రూడ్. పెట్రోలు తయారీకి ఇది సరైనదే. ఇతర ఉత్పత్తుల తయారీకి అనువైనది కాదు. వెనెజువెలాలో రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రపంచం మొత్తం మీద రోజుకు ఉత్పత్తి అయ్యే చమురులో కేవలం 0.8 శాతం మాత్రమే వెనెజువెలాలో ఉత్పత్తి అవుతుంది.

చమురు ఉన్నా వెనెజువెలాకు ఈ దుస్థితి ఎందుకు?: ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు ఉన్న వెనెజువెలా తలసరి ఆదాయం విషయంలో 2025లో ప్రపంచంలో 127వ స్థానంలో ఉంది. దేశ జనాభాలో 90 శాతం మంది పేదలే. 2018లో ద్రవ్యోల్బణం 1.7 మిలియన్ శాతానికి చేరుకుంది. ఫలితంగా 50,000; 1,00,000 డినామినేషన్ నోట్లను ప్రభుత్వం ముద్రించింది. కోడిగుడ్లు కొనడానికి ప్రజలు 1,00,000 విలువ గల నోట్లను 20 తీసుకోవలసి వచ్చేది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి వల్ల దేశం ఈ దుస్థితిలో ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం చమురుపైన మాత్రమే ఆధారపడింది. 1970వ దశకంలో ఈ దేశంలో రోజుకు 3.5 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి జరిగేది. అంటే, ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న చమురులో సుమారు 7 శాతం అన్నమాట. క్రమంగా చమురు ఈ దేశ అతి పెద్ద బలహీనతగా మారింది. చమురు పరిశ్రమను 1976లో జాతీయాకరణ చేశారు. పీడీవీఎస్ఏ అనే ప్రభుత్వ కంపెనీని ఏర్పాటు చేశారు. 2002-03లో సమ్మె జరిగింది. ప్రభుత్వం 18,000 మంది వర్కర్లను తొలగించింది. చమురు నుంచి బిలియన్ల డాలర్ల సంపాదించినప్పటికీ, నిధులను పొదుపు చేయలేదు. 1980వ దశకంలో ధరలు పతనమవడంతో, మొత్తం వ్యవస్థ కుప్పకూలింది, ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 1992లో ప్రజలు ప్రెసిడెంట్ హ్యూగో ఛావెజ్‌పై తిరుగుబాటు చేశారు. కానీ విఫలమయ్యారు. 2004-2008 మధ్య కాలంలో చమురు ధరలు బ్యారెల్‌కు 140 డాలర్లకు పెరిగాయి. భారీ లాభాలు రావడంతో, ప్రభుత్వం ఉచిత గృహ నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, చౌక ధరలకు ఆహారం పథకాలను ప్రవేశపెట్టింది. ల్యాప్‌టాప్‌లు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసింది.ప్రభుత్వం బలవంతంగా ఆహార ధరలను తగ్గించింది. ప్రైవేట్ కంపెనీలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఫలితంగా ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం చమురు ద్వారా వచ్చిన సొమ్ముతో అన్నిటినీ దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. దేశంలోని పరిశ్రమలు మూతపడ్డాయి, నిరుద్యోగం పెరిగిపోయింది. పీడీవీఎస్ఏని ఏర్పాటు చేసిన తర్వాత చాలా విదేశీ కంపెనీలు ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం వాటి ప్లాంట్లను స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత విదేశీ పెట్టుబడులు చెప్పుకోదగ్గ స్థాయిలో రాలేదు. నైపుణ్యం గల ఇంజినీర్లు, నిపుణులు పీడీవీఎస్ఏని వదిలిపెట్టారు, వారి స్థానాల్లో రాజకీయ ప్రేరేపిత నియామకాలు జరిగాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టలేదు, మెషినరీని మెయింటెయిన్ చేయలేదు. ఫలితంగా చమురు వెలికితీత సామర్థం తగ్గుతూ వచ్చింది. 50 ఏళ్ల నుంచి పైప్‌లైన్లను అప్‌డేట్ చేయలేదని, రిఫైనరీలు దయనీయస్థితిలో ఉన్నాయని పీడీవీఎస్ఏ సర్ది చెప్తున్నది. మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, ఉత్పత్తి పునఃప్రారంభం కోసం 58 బిలియన్ డాలర్ల మేరకు ఖర్చవుతుంది.అమెరికా ఆంక్షలు..: గతంలో వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారు అమెరికా. ఛావెజ్ విధానాలు, ప్రకటనల వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారుగా చైనా మారింది. చమురుకు బదులుగా 10 బిలియన్ డాలర్ల రుణాలను చైనా ఇచ్చింది. వెనెజువెలా చమురును అమ్ముతున్నప్పటికీ, ఆదాయాన్ని సంపాదించలేకపోతున్నది. 2018లో వెనెజువెలా ప్రభుత్వం అమెరికన్ డాలర్లలో వ్యాపారాన్ని నిషేధించింది. ఒక డాలర్‌కు 10 బొలివర్స్ ఎక్స్ఛేంజ్ రేట్‌ను నిర్ణయించింది. కానీ మార్కెట్ రేటు ఒక డాలర్‌కు 1,000కిపైగా బొలివర్లు ఉంది. 2019 తర్వాత అమెరికా, ఇతర దేశాలు వెనెజువెలా ఆయిల్ కంపెనీపై ఆంక్షలు విధించాయి. దీంతో చమురు అమ్మకాలు, పెట్టుబడులను ఆకర్షించడం కష్టంగా మారింది. వీటన్నిటి వల్ల వెనెజువెలా దయనీయ స్థితికి చేరింది. వెనెజువెలా నియంత్రణతో అమెరికాకు ప్రయోజనం ఏంటి?: వెనెజువెలాలో సుమారు 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్ ఉంది. దీనిని లీటర్ సుమారు 60 పైసలకు అమ్ముతున్నది. ఇక్కడి చమురుకు అతి పెద్ద కొనుగోలుదారు చైనా. 70-90 శాతం చమురును చైనా కొంటున్నది. ఇప్పుడు వెనెజువెలా చమురు రంగంలో భారీగా పెట్టుబడులు పెడతామని ట్రంప్ చెప్పారు. ట్రంప్ ప్రణాళిక విజయవంతమైతే, అమెరికా కూడా మిలియన్ల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకోగలుగుతుంది. భారత్‌పై ప్రభావం?: వెనెజువెలా చమురు నిక్షేపాలపై ట్రంప్ దృఢమైన నిర్ణయం తీసుకోకపోతే, చమురు ధరలపై ప్రభావం పెద్దగా ఉండదని విశ్లేషకులు చెప్తున్నారు. వెనెజువెలా చమురు ఉత్పత్తిని 5-10 శాతం నుంచి 50 శాతానికి అమెరికా పెంచగలిగితే, చమురు ధరలపై ప్రభావం పడుతుందని చెప్తున్నారు. మన దేశంలో కూడా పెట్రోలు, డీజిల్ ధరలు కొంత మేరకు తగ్గవచ్చునన్నారు. అయితే, దీనికి కొంత సమయం పడుతుందని చెప్పారు. అమెరికా చెప్పుకోదగినంత చేయకపోతే, మార్పులేవీ ఉండవని తెలిపారు.

## గాయపడ్డ యువకునికి 50,000 అందజేత

కమాన్ పూర్ : కమాన్ పూర్ గ్రామ పంచా యతీ పరిధిలోని బాపూజీ నగర్ కు చెందిన కొంత చందు వైద్య పరీక్షల నిమిత్తం 50 వేల రూపాయలను నీట్ 2026 పేరెం ట్స్ గ్రూపువారు కొంతం వనీతకు అందజేశారు. ఇటీవల కొంత చందు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగాగాయపడగా అతని హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేయించారు. నిరుపేద కుటుం బానికి చెందిన కొంతం చందు చికిత్సకు అంత స్తోమత లేకపోవడం తో బాధిత కుటుంబం సహాయం అందించాలని పలువురిని వేడుకుంటున్నారు. దీనిలో భాగంగా నీ కుటుంబ సభ్యులకు తెలుసుకొని వారు 50వేల రూపాయలను చందు తల్లికి అందించారు.



# దలాల్ స్ట్రీట్‌కు యుఎస్ టారిఫ్‌ల దడ




- రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ 780 పాయింట్ల పతనం
- కొనసాగుతోన్న భౌగోళిక భయాలు
- రోజంతా అమ్మకాలే

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా నాలుగో రోజూ భారీ నష్టాలను చవి చూశాయి. భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారనే రిపోర్టులు దలాల్ స్ట్రీట్‌ను దారుణంగా పడిపోయేలా చేశాయి. మరోవైపు వెనిజులాపై యుఎస్ ఉగ్రదాడి మరిన్ని భౌగోళిక ఆందోళనలకు దారి తీయొచ్చనే మదుపర్ల అంచనాలు ముంచాయి. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఇటీవల ఎప్పుడూ లేని విధంగా భారత మార్కెట్లు కుప్పకూలాయి. ఒక్క పూటలో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు పైగా హరించుకుపో యింది. బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయం 84,778 నష్టాల్లో ప్రారంభం కాగా.. ఏదశలోనూ కోలుకోకపోగా రోజంతా అమ్మకాల ఒత్తిడిని చవి చూసింది. ఇంట్రాడేలో 84,110 కనిష్టానికి పడిపోయింది. తుదకు 780.18 పాయింట్లు లేదా 0.92 శాతం పతనమై 84,180.96కు దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 263.9 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టంతో 25,876.85కు పరిమితమ య్యింది. 2025 డిసెంబర్ 8 తర్వాత మార్కెట్లు అత్యధికంగా పడిపోవడం ఇదే తొలిసారి. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ మొత్తంగా1600 పాయింట్లు, నిఫ్టీ 470పాయింట్ల చొప్పున క్షీణిం చాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 1.96 శాతం,స్మాల్ క్యాప్1.99 శాతం చొప్పునపతనమయ్యాయి. అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. లోహ సూచీ అత్యధికంగా 3 శాతం కోల్పోగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 2.8 శాతం, పిఎస్‌యు బ్యాంకింగ్ 2 శాతం, ఐటి 1.9 శాతం చొప్పున కుదేలాయ్యా యి. ఒక్క సెషన్‌లోనే మదుపర్ల సంపద రూ.8.1 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోవడంతో. బిఎస్ఇలో నమోదిత కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసిఐసిఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బిఇఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నేల చూపులు చూశాయి. హిందాల్కో ఇండిస్టీస్ 3.78 శాతం, జియో ఫైనాన్సియల్ 3.57 శాతం, ఒఎన్‌జిసి 3.29 శాతం చొప్పున అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బిఎస్‌ఇలో 4,367 స్టాక్స్ ట్రేడింగ్ కాగా.. 1,039 సూచీలు రాణించగా.. 3,158 స్టాక్స్ పతనమయ్యాయి. మరో 170 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై 500 శాతం వరకు అదనపు సుంకాలు విధించడానికి వీలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'శాంక్షనింగ్ ఆఫ్ రష్యా యాక్ట్ 2025' అనే బిల్లుకు గ్రీన్ సిగల్ ఇచ్చారు. ఇది భారత ఎగుమతిదారులు, ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన కలిగించింది. వెనిజులా అధ్యక్షుడు మదురోను అమెరికా దుర్మార్గంగా అరెస్ట్ చేయ డం అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను పెంచింది. ఈ వ్యవహారంపై వెనిజులాకు రష్యా, చైనా సహా పలు లాటిన్ అమెరికా దేశాలు మద్దతును ఇవ్వడంతో పరిస్థితులు మరింత తీవ్రతరం కావొచ్చనే ఆందోళనలు ఇన్వెస్టర్లలో పెరిగాయి.

దేశీయంగా దిగ్గజ సూచీలు రిలయన్స్ ఇండిస్టీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు ఈ వారంలో 4 శాతం వరకు నష్టపోయాయి. ఇండెక్స్‌లో వీటి వాటా ఎక్కువ కావడంతో, ఈ షేర్ల పతనం మొత్తం మార్కెట్‌లను ఒత్తిడికి గురి చేశాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారత స్టాక్ మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. జనవరి నెలలో ఇప్పటి వరకు సుమారు 694 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించారు. భారత జిడిపి 2025-26లో 7.4 శాతం పెరగొచ్చనే అంచనాలు వేసినప్పటికీ.. ద్వితీయార్థంలో ఇది 6.9 శాతానికి పడిపోవచ్చనే రేటింగ్ ఎజెన్సీ అంచనాలు మార్కెట్లపై ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా జపాన్, చైనా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ట్రేడింగ్ కావడం భారత మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

## గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందో తెలుసా?

విజయవాడ, : కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత గ్రౌండ్ లెవెల్ రియాలిటీని చంద్రబాబుకు చేరకుండా కొందరు అడ్డుపడుతున్నారన్నవిమర్శలున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్నది పార్టీ నాయకత్వానికి తెలియడం లేదా అంటే లేదనే సీనియర్ నేతలు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయిలో నియమించి నెలవారీ జీతాలు చెల్లించి పెట్టుకున్న వారు సయితం పెద్దగా యాక్టివ్‌గా లేరని సాక్షాత్తూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ లు కేవలం కేంద్ర రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని మూడో అంతస్తు నుంచి వచ్చే నివేదికలను చూసి సంబపరపడుతున్నారని, కానీ గ్రౌండ్ లెవెల్లో జరుగుతున్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారని కొందరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా బయటపెడుతున్నారు. దీంతో పాటు అధికారులు తీసుకుంటున్నారో.. లేక మంత్రుల నిర్ణయమో తెలియదు కానీ..వైసీపీ నేతలకు, కాంట్రాక్టర్లకు పనులు బాగా ఈ కూటమి ప్రభుత్వంలో అవుతున్నా యన్న ఆవేదన కూడా కార్యకర్తల్లోనూ, నేతల్లోనూ ఉంది. ఆ విషయం కూడా తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియాలో పుంఖాను పుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ ఇప్పుడు టీడీపీ హయాంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడాన్ని వారు అభ్యంతరం చెబుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుందన్న ది చంద్రబాబుకు తెలిసి జరుగుతుందా? లేక తెలియక జరుగుతుం దా? అని నెట్టింట్లో కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇక తాజాగా తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలకు వచ్చినప్పుడు వైసీపీ నేతలకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనాలు చేయించడం కూడా సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ఫైర్ అవుతున్నారు. అసలు ప్రభుత్వం లో ఏం జరుగుతుంది? రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలు చంద్రబా బు, లోకేశ్ కు చేరకుండా ఎవరైనా అడ్డుపడుతున్నారా?అన్న అనుమా నాలను కూడావ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్ లు క్యాడర్ కోసం, పార్టీ కోసం కష్టపడిన వారి కోసం నిచేస్తామంటుంటే అందుకు విరుద్ధంగా పనులు జరుగుతుండటం పట్ల కార్యకర్తలు, నేతల్లో అసం తృప్తి వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా చంద్రబాబు పాలనలో ఏం జరుగు తుందో సరి చూసుకోవాలంటూ కార్యకర్తలు కోరుతున్నారు.

# అచ్చెన్నకు షాక్..?



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ మంత్రి అచ్చెన్నాయుడుకు పార్టీ నాయకత్వం షాక్ ఇచ్చింది. ఆఫ్కాఫ్ ఛైర్మన్ రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ మత్స్యకారుల ఫెడరేషన్ ఛైర్మన్ ఎన్నికలను మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలు సీరియస్ గా తీసుకున్నారు. అచ్చెన్నాయుడు కర్నూలు జిల్లాకు చెందిన నవీన్ పేరును ప్రతిపాదించారు. కొల్లు రవీంద్ర రాంప్రసాద్ కు మద్దతిచ్చారు. అయితే ఇరు వర్గాలు క్యాంప్ లను నిర్వహించడంతో పార్టీ నాయక త్వం దృష్టికి వచ్చింది. దీంతో తాము సూచించిన వారు మాత్రమే నామినేషన్ వేయాలని పార్టీ హైకమాండ్ సూచించింది. చివరకు ఆఫ్కాఫ్ ఛైర్మన్ గా రాంప్రసాద్ పేరును అధినాయకత్వం సూచించింది. దీంతో ఆయన ఒక్కరే నామినేషన్ వేశారు. రాంప్రసాద్ కడప జిల్లాకు చెందిన వారు. దీంతో అచ్చెన్నాయుడు మద్దతిచ్చిన నవీన్ నామినేషన్ వేయలేదు. పార్టీ హైకమాండ్ కొల్లు రవీంద్ర వైపు మొగ్గు చూపినట్లయింది. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. అయితే ఇందులో కీలకమైన విషయం ఏంటంటే మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడును కేబినెట్ నుంచి తప్పించాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. ఈ మేరకు పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. అయితే అదే సమయంలో అచ్చెన్నాయుడుకు కీలకమైన పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. అదీ పార్టీ పరంగా పదవి ఇచ్చేందుకు సిద్ధమయినట్లు తెలిసింది. అచ్చెన్నాయుడును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చేయాలని చంద్రబాబు దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. అచ్చెన్నాయుడు సీనియర్ నేత. కొన్ని దశాబ్దాల నుంచి కింజారపు కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉంది. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, లేనప్పటికీ ఆ కుటుంబం వేరే పార్టీ వైపు చూడలేదు. శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే కాకుండా ఉత్తరాంధ్రలోనూ టీడీపీకి మంచి పట్టున్న ఫ్యామిలీగా కింజారపు కుటుంబానికి పేరుంది. ఇప్పటికీ కేంద్రమంత్రివర్గంలో ఉన్న రామ్మోహన్ నాయుడుపై చంద్రబాబుకు కాని, లోకేశ్ కు కాని సదాభిప్రాయం ఉంది. ముఖ్యంగా లోకేశ్ కు రామ్మోహన్ నాయుడు సన్నిహితుడు కావడంతో పాటు ఎర్రన్నాయుడు కుమారుడిగా ఆయనకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రామ్మోహన్ నాయుడు ఎప్పుడూ జిల్లా రాజకీయాల్లో కానీ, ఇతర విషయాల్లోనూ జోక్యం చేసుకోరన్న పేరుంది. కానీ అచ్చెన్నాయుడు మాత్రం ఈ దఫా అనేక నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివాదాలు కూడా చంద్రబాబుకు తలనొప్పిని తెచ్చిపెడుతున్నాయంటున్నారు. ఆప్కాఫ్ ఛైర్మన్ పదవి విషయంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రల మధ్య వివాదం కూడా ఈ నిర్ణయానికి కారణమంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని చేస్తే సామాజికవర్గం పరంగా బీసీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని, ప్రస్తుత అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు. దానివల్ల అచ్చెన్నాయుడుకు కీలకమైన పదవి ఇచ్చినట్లవుతుందని చంద్రబాబు భావిస్తున్నారంటు న్నారు. అదే సమయంలో భారీగా మంత్రివర్గంలో మార్పులు చేయాలని కూడా చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది.

## ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ!

నెల్లూరు, : నెల్లూరు జిల్లా ఉదయగిరి టీడీపీలో అంతర్గత విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్..మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఎన్నికలప్పటి నుంచే ఉప్పు-నిప్పుగా ఉంటున్నారట. తనను బద్నామ్ చేయాలన్నదే బొల్లినేని టార్గెట్ అంటూ ఎమ్మెల్యే రగిలిపోతున్నారు. అవకాశం దొరికితే అడ్డంగా బుక్ చేసి తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాసుకొని కూర్చున్నారని మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా కుట్ర చేసిన నేతతో కలిసి బొల్లినేని..కొత్త జిమ్మిక్కులకు తెరలేపారన్నది ఎమ్మెల్యే అలిగేషన్. అయితే ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలకు భయపడేది లేదంటూ గట్టి రియాక్ట్ అవుతున్నారు ఎమ్మెల్యే. కుట్రలు చేస్తున్నదెవరైనా దూల తీరుస్తానంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు. మీ జాతకాలు తీసుకెళ్లి అధిష్టానం దగ్గర పెడతానంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పొలిటికల్ ఫైట్ నడుస్తుండగానే..రీసెంట్‌గా ఈ ఎపిసోడ్‌లోకి ఓ లేడీ ఎంట్రీ ఇవ్వడం మరింత హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఇటు ఎమ్మెల్యే..ఇటు మాజీ ఎమ్మెల్యే..మధ్యలో లేడీ అన్నట్లుగా ఆసక్తికరంగా మారింది ఇష్యూ. గత ఎన్నికల్లో బొల్లినేని రామారావు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడగా.. టికెట్ తెచ్చుకున్న కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, బొల్లినేని రామారావు మధ్య అంతర్గతంగా గ్యాప్ నడుస్తూనే ఉందట. ఏదో ఒక ఘటనతో ఇద్దరి మధ్య అంతర్గత విభేదాలు అప్పు డప్పుడు బయటపడుతూనే ఉన్నాయట. ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించారు ఎమ్మెల్యే. ఆ కాంట్రాక్టర్లను బొల్లినేని రామారావు వర్గం బెదిరించిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల అభివృద్ధిని అడ్డుకుంటే..తాటతీస్తా..! తొక్కుకుంటూ వెళ్తా..అంటూ.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కామెంట్స్ చేశారట. బొల్లినేని రామారావును ఉద్దేశించే ఎమ్మెల్యేలా ఇలా మాట్లాడారన్న చర్చ ఉండనే ఉంది. అంతేకాదు గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా వ్యతిరేకంగా పనిచేసిన బొబ్బూరు వెంగళరావును..బొల్లినేని దగ్గర చేర్చుకుని కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు ఎమ్మెల్యే. అయితే ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య విభేదాలు రచ్చకెక్కి చర్చకు దారితీస్తున్న వేళ..ఈ ఎపిసోడ్‌లోకి వెంగమాంబ అనే మహిళ ఎంట్రీ ఇచ్చింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై ఆమె ఆరోపణలు చేసిన వీడియో వైరల్ అయింది. కాకర్ల సురేష్‌ను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పించుమని అడిగితే..నీకు ఉద్యోగం కంటే రాజకీయాలే బాగా సూట్ అవుతాయని ఆశ కల్పించారని చెప్పింది. ఇప్పుడేమో పాలిటిక్స్ నీకెందుకు హ్యాపీగా వ్యాపారం చేసుకో అంటూ మోసం చేశారని వెంగమాంబ ఆరోపించింది. ఆమె ఆరోపణలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్..కొట్టి పారేశారు. కొందరు టీడీపీ నేతలే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను పురమాయించి వీడియోలు చేయించి కుట్ర చేస్తున్నారని ఫైరయ్యారు.

# నిర్వాసితులను ముంచడానికేనా..?



వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన మీడియాతో కొన్ని విషయాలు ప్రస్తావించారు కానీ ఇంకొన్ని కీలకాంశాలు విస్మరించడం విస్తుగొలుపుతోంది. సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరా వాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.

**రెండు దశల మాట నిర్వాసితులను ముంచడానికేనా..!:** జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టందాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ (ఆర్‌అండ్ ఆర్) విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆతరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర.


అందుకనే దశ లవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.

బాధితులను కలిసి పలకరించలేరా: ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా క్ష్మలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలు కు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తు న్నారు. కానీ ముఖ్యమంత్రి వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రంపరిశీలించిన ఆయనముంపు ప్రాంతా లను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరి ంచడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన.

కాంట్రాక్టర్లపై వారికీ వీరికీ ఎంత ప్రేమో..: డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేకపోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫై చేసిన ఉన్నతాధికారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు.

**వాస్తవమేమిటో చెప్పేస్తే సరి:** రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రితో ఏకాంతంగా మాట్లాడి ఆపివేయించానని, అందువల్లే పనులు నిలిచిపోయాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ప్రకటనపై చంద్రబాబు నాయుడు స్పందించి వాస్తవం వెల్లడించాలని ప్రజలు కోరుకుంటున్నారు. విదేశీ పర్యటన నుండి వచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే అన్ని విషయాలూ చెబుతానన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో జల వివాదాల గురించి ప్రస్తావించినా అప్పుడేమీ చెప్పలేదు. నీటి విషయంలో రాజకీయాలు చేయకూడదని, రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సిఎం అన్నారు. ఒక అబద్ధం చెబితే నిజం అయిపోతుందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారే తప్ప తెలంగాణ సిఎంతో ఆర్‌ఎల్ఐ గురించి ఏం మాట్లాడారో వాస్తవం చెప్పేస్తే సరిపోతుంది కదా...!

# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా








మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈసినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్– త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎం దుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ – త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

# రెండో పెళ్లిపై లోకేష్ కనగరాజ్ రియాక్షన్..

కోలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. యంగ్ హీరోలతో, స్టార్స్‌తో భారీ ప్రాజెక్ట్స్ తెరకెక్కిస్తూ.. తీరిక లేకుండా గడుపుతున్నారు. చేసినవి కొన్ని సినిమాలే అయినా, బాక్సాఫీస్ దగ్గర వందల కోట్లు కొల్లగొడుతూ పాన్ ఇండియా లెవల్లో పాపులర్ అయ్యారు. తమిళ హీరోలతోనే కాకుండా పాన్ ఇండియా హీరోలతో కూడా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో 'ఎఎ-23' వంటి భారీ ప్రాజెక్ట్‌లు ప్లాన్ చేస్తూ బిజీగా ఉన్న లోకేష్, తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. గత కొద్దికాలంగా లోకేష్ ఒక స్టార్ హీరోయిన్‌తో ప్రేమలో ఉన్నారని, త్వరలోనే ఆమెను పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. తాజాగా, ఓ ఈవెంట్‌లో పాల్గొన్న లోకేష్ స్పందించి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దీనిపై ఒక ఈవెంట్‌లో యాంకర్ ప్రశ్నించగా.. లోకేష్ తనదైన శైలిలో స్పందించారు. "నా మీద చాలా రూమర్స్ వచ్చాయి, కేవలం ఒక హీరోయిన్‌తోనే కాదు, చాలామందితో ముడిపెట్టారు. నాకు ఇప్పటికే ఒక కుటుంబం ఉంది. నేను ఫ్యామిలీ మ్యాన్‌ని" అని క్లారిటీ ఇచ్చారు. అయితే యాంకర్ కొంచెం ఎగతాళిగా 'మరి రెండో ఫ్యామిలీ ఆలోచన లేదా?' అని అడగ్గా, లోకేష్ సీరియస్‌గా "నేను సమాధానం చెప్పను" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు.



# భారతదేశంలోని గొప్ప నటీమణుల్లో ఆమె ఒకరు

రణ్‌భీర్ కపూర్ తన ఇష్టమైన నటి రాణీ ముఖర్జీ 30 వసంతాల ప్రస్థానాన్ని సెలబ్రేట్ చేయటానికి భారతీయ సినీ పరిశ్రమ కలిసి ముందుకు రావటం చూసి చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రణ్‌భీర్ కపూర్ మాట్లాడుతూ "రాణీ ముఖర్జీ సావరియా చిత్రంలో నాతో కలిసి నటించారు. నేనెంతో కష్టపడి నటించానని నాకు చెప్పి ప్రోత్సహించిన మొదటి వ్యక్తి తనే. నాకు, ఆమె జరిగిన సంభాషణను నేను మరచిపోలేను. నాకు అవసరమైన సమయంలో ఆమె మాటలు నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. నేను రాణి ముఖర్జీని దగ్గరగా గమనించాను. నేను రాణి వర్క్‌ను చాలా దగ్గరగా గమనించాను. ఆమె గ్రేస్, ఛార్మ్, తెలివితేటలకు ముగ్ధుడినయ్యాను. రాణీ ముఖర్జీ తన 30ఏళ్ల సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేసుకోవటం నిజంగా అద్భుతం. రాణి ముఖర్జీ ఎప్పటికీ ప్రత్యేకమైన వ్యక్తిగా నేను భావిస్తాను. భారత దేశంలోని గొప్ప నటీమణుల్లో ఆమె ఒకరు. మన ఇండస్ట్రీ ఏంటో ఆమె తన పనితనంతో నిర్వచించారు. ఆమె ఎంచుకునే సినిమాలు, పాత్రలు ఇప్పుడు స్క్రీన్‌పై మహిళలను చూపించే విధానాన్ని మార్చాయి. రాణీ తన సినిమాలతో ప్రేక్షకులను మెప్పించాలనుకున్నారు. ఆమె మనకు అందించిన చిత్రాలు, వాటి తీపి గుర్తులను మనం మరచిపోలేం. అందుకు ఆమెకు ధన్యవాదాలు. మనల్ని నటనతో మెప్పించటానికి, సంతోషపరచటానికి జీవితాన్ని ఇచ్చిన ఎంటరటైనర్ ఆమె.




# లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ థ్రిల్లర్‌తో సమంత గ్రాండ్ రీఎంట్రీ



పెళ్లి తర్వాత కొంత విరామం తీసుకున్న స్టార్ హీరోయిన్ సమంత, ఇప్పుడు మరోసారి టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీలో నటిస్తూ సుదీర్ఘ విరామం అనంతరం ఆమె బిగ్ స్క్రీన్‌పై రీఎంట్రీ ఇవ్వనుంది. సమంత నటిస్తున్న తాజా చిత్రం'మాఇంటిబంగారం'. ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ని చిత్ర యూనిట్ విడుదల చేయగా, అది అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. సమంత పూర్తిగా మాస్ అవతార్‌లో కనిపించారు. ఓ బస్సులో చీరకట్టుతో, రగ్డ్ అండ్ సీరియస్ లుక్స్‌తో ఫైట్ చేస్తుండడం అందరిని ఆశ్చర్యపరిచింది. గతంలో ఎప్పుడు లేని విధంగా సమంత ఈ చిత్రంలో సందడి చేయనున్నట్టు తెలుస్తుంది. సామ్ డైలాగ్స్, యాక్షన్ సన్నివేశా లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ మూవీపై అంచనాలు పెంచేసింది. సాధారణంగా ఆమె నుంచి కనిపించే గ్లామర్‌కు భిన్నంగా, పవర్‌ఫుల్ యాక్షన్ క్యారెక్టర్‌లో సమంత కనిపిం చడంతో సోషల్ మీడియాలో వీడియో వైరల్‌గా మారింది. టైటిల్ వినడానికి ఫ్యామిలీ టచ్ ఉన్నట్టు అనిపించినా, సినిమా మాత్రం పూర్తిస్థాయి యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్నట్లు అర్థమవుతుంది. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఓ బేబీ' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత సమంత–నందిని రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న మరో సినిమా కావడంతో అంచనాలు మరింత పెరిగాయి. కథను రాజ్ నిడిమోరు, వసంత్ మారిగంటి అందించగా, ఈ సినిమాను త్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక నటీనటుల విషయానికి వస్తే, 'కాంతారా ఛాప్టర్ 1' ఫేమ్ గుల్షన్ దేవయ్య, కన్నడ స్టార్ హీరో దిగంత్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తున్నారు, ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు మరింత బలం చేకూరుస్తుందని భావిస్తున్నారు. విశేషమేమిటంటే, 'మా ఇంటి బంగారం'లో సమంత బాడీ డబుల్స్ సహాయం లేకుండానే స్టంట్స్ చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే 'ది ఫ్యామిలీ మాన్ 2', 'సిటాడెల్' వంటి వెబ్ సిరీస్‌లలో యాక్షన్ పాత్రలతో మెప్పించిన సమంత, అదే జానర్‌ను ఈ సినిమాతో కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. సమంత చివరిసారిగా 2025లో కామెడీ హారర్ మూవీ 'శుభం'లో అతిథి పాత్రలో కనిపించగా, ఇప్పుడు ఫుల్ లెంగ్త్ లేడీ ఓరియెంటెడ్ సినిమాలో ప్రధాన పాత్రలో మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది.

# ముగ్గురు పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల




శ్రీలీల అంటే వెండితెరపై మెరిసే అందం, ఎనర్జీతో నిండిన డాన్స్, వరుస హిట్ సినిమాలే గుర్తుకు వస్తాయి. కానీ ఈ యువ హీరోయిన్ గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాదని, ఆమె మనసు ఎంత విశాలమో మరోసారి నిరూపించుకుంది. స్టార్ హీరోయిన్‌గా కెరీర్‌లో వేగంగా ముందుకెళ్తున్న శ్రీలీల, కేవలం 24 ఏళ్ల వయసులోనే ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచింది. తెరపై ప్రేక్షకులను అలరిస్తూనే, తెర వెనుక బాధ్యతగల పౌరురాలిగా తన ప్రత్యేక గుర్తింపును చాటుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ దత్తత అంశంపై స్పందించిన శ్రీలీల, తన మనసులోని భావాలను ఎంతో ఆత్మీయంగా పంచుకుంది.

ఈ విషయం గురించి మాట్లాడా లంటే నాకు మాటలు రావు. కాస్త భావోద్వేగానికి లోనవుతాను కూడా. కానీ ఆ పిల్లల్ని నేను పూర్తిగా నా బాధ్యతగా చూసుకుంటున్నాను. వాళ్లకు నేను సాధారణంగా మనం ఊహించుకునే అమ్మలా ఉండను. దానికి వెనుక ఒక ప్రత్యేకమైన కథ ఉంది అంటూ తన ప్రయాణాన్ని వివరించింది. తన జీవితంలో ఈ నిర్ణయం ఎలా మార్పు తీసుకొచ్చిం దో చెప్పేటప్పుడు ఆమె మాటల్లో స్పష్టమైన భావోద్వేగం కనిపించింది. తన కెరీర్ ప్రారంభ దశలో 'కిస్' సినిమా సమయంలో ఒక ఆశ్రమాన్ని సందర్శించిన సందర్భాన్ని శ్రీలీల గుర్తు చేసుకుంది. అక్కడి పిల్లలతో ఏర్పడిన అనుబంధమే తన జీవితాన్ని మలుపు తిప్పిందని ఆమె తెలిపింది. మొదట ఈ విషయాన్ని పూర్తిగా వ్యక్తిగతంగా ఉంచాలనుకున్నప్పటికీ, సమాజంలో మరికొంత మందిలో సేవా భావం పెరగాలనే ఉద్దేశంతోనే ఇప్పుడు ఈ విషయం బయటకు చెప్పినట్లు వెల్లడించింది. తన నిర్ణయం ఎవరికైనా ప్రేరణగా మారితే చాలు అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నానని పేర్కొంది. 2022లోనే ఇద్దరు దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకున్న శ్రీలీల, తర్వాత మరో పిల్లవాడిని కూడా తన జీవితంలో భాగం చేసుకుంది. సినిమాల షూటింగ్‌లు, కెరీర్ బిజీ షెడ్యూల్ మధ్యలోనూ పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారి చదువు, ఆరోగ్యం, జీవనోపాధి విషయంలో పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు సమాచారం. స్టార్‌డమ్ ఉన్నప్పటికీ సాధారణ మనిషిలా, ప్రేమతో కూడిన బంధాన్ని నిర్మించడమే తన లక్ష్యమని ఆమె చెబుతోంది. మొత్తానికి శ్రీలీల తన నటనతోనే కాదు, తన మనసుతో కూడా నిజమైన 'స్టార్' అని నిరూపించుకుంటోంది. గ్లామర్ ప్రపంచంలో ఉండి కూడా సేవ, మానవత్వం, బాధ్యతలను మరిచిపోకుండా ముందుకు సాగుతున్న ఈ యువ నటి చర్యలు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# సినీ ప్రియులకు నిద్రపట్టకుండా చేస్తున్న 'సీతారామం'

టాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో వచ్చిన క్లాసిక్ లవ్ స్టోరీస్‌లో 'సీతారామం' టాప్‌లో ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. దుల్కర్ సల్మాన్ తననటనతో 'రామ్'గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేస్తే, మృణాల్ ఠాకూర్ 'సీత'గా ఒక దేవతలా మెరిసిపోయింది. వీరిద్దరి మధ్య సాగే ఆక్యూట్ లవ్ స్టోరీకి హను రాఘవపూడి మేకింగ్, విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ తోడవ్వడంతో ఆ సినిమా ఒక ఎమోషనల్ జర్నీలా సాగింది. అయితే, ఇప్పుడు ఈకాంబో గురించి వస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. బ్లాక్ బస్టర్ హిట్ 'సీతారామం'కు సీక్వెల్ రాబోతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ మళ్ళీ జతకట్టబోతున్నారు. అయితే ఇది మొదటి భాగానికి కొనసాగింపుగా ఉంటుందా లేక అదే బ్యాక్‌డ్రాప్‌లో సాగే సరికొత్త ప్రేమకథా? అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదటి పార్ట్‌లో రామ్ మరణంతో కథముగియడంతో, పార్ట్ 2లో కథను ఎలా మలుపు తిప్పుతారో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సీక్వెల్‌లో రామ్ ఇంకా బతికే ఉంటాడా? లేక చనిపోయినట్లుగా చూపిస్తారనేది? ప్రేక్షకులకు నిద్రపట్టకుండా చేస్తోంది. బహుశా ఫ్లాష్‌బ్యాక్ సీన్స్ లేదా రామ్–సీతల మధ్య ఉన్న మరిన్ని మధుర జ్ఞాపకాలతో ఈ సినిమాను ముందుకు తీసుకెళ్లే ఛాన్స్ ఉందని టాక్. దర్శకుడు హను రాఘవపూడి ప్రస్తుతం ప్రభాస్‌తో ఒక భారీ ప్రాజెక్ట్ (ఫౌజీ) చేస్తున్న విషయం తెలిసిందే. అది పూర్తయిన వెంటనే 'సీతారామం 2' పై ఫోకస్ పెట్టే అవకాశం ఉందట.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215